


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 12 సంచిక : 149 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం మంగళవారం 3 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥


VOLUME :12 ISSUE :149 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM TUE 3 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

# రాష్ట్రంలో హింసను ప్రేరేపించాలని చూస్తోంది..


## వైసీపీపై చంద్రబాబు ఫైర్

- అధికారం కోల్పోయామనే అసహనంతో రెచ్చగొట్టేందుకు యత్నం
- ఆ పార్టీ ట్రాప్ లో పడొద్దంటూ పార్టీ నేతలకు సూచన
- మంత్రులు, టీడీపీ సీనియర్ నేతలతో సీఎం టెలీకాన్ఫరెన్స్



ఆంధ్రప్రదేశ్ లో అలజడి సృష్టించాలని, హింసను ప్రేరేపించాలని వైసీపీ ప్రయత్నిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపించారు. ఇందులో భాగంగానే రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తోందని... ఆ ట్రాప్ లో పడొద్దని టీడీపీ నేతలకు ఆయన సూచించారు. ఈ మేరకు మంత్రులు, పార్టీ సీనియర్ నేతలతో ఆయన ఈ రోజు ఉదయం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.అధికారం కోల్పోయామనే అసహనంతోనే వైసీపీ రెచ్చగొట్టాలని చూస్తోందని చంద్రబాబు చెప్పారు. అందుకే ఆ పార్టీ నేతలు బూతులు మాట్లాడుతున్నారని, సంయమనం పాటించాలని చెప్పారు. ఈ టెలీకాన్ఫరెన్స్ లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.వైసీపీ రెచ్చగొట్టే చర్యలకు దిగుతోందన్న చంద్రబాబు.. ఆ పార్టీ ఉచ్చులో పడి టీడీపీ శ్రేణులు సంయమనం కోల్పోకుండా చూసుకోవాల్సిన బాధ్యత సీనియర్ నేతలదేనని చెప్పారు. హింస, విధ్వంసం, అవినీతి పునాదులపై వైసీపీ పుట్టిందని, ఆ పార్టీ ట్రాప్‌లో పడితే వారికీ మనకూ తేడా ఉండదని అన్నారు.

ఈ సందర్భంగా తప్పుచేసిన ప్రతి ఒక్కరినీ చట్టపరంగా శిక్షించి తీరుతామని చంద్రబాబు స్పష్టం చేశారు.తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో అడ్డంగా దొరికిపోయిన వైసీపీని రాష్ట్ర ప్రజలు చీదరించుకుంటున్నారని అన్నారు. ఈ క్రమంలో తాము చేసిన పాపాల నుంచి ప్రజల దృష్టి మళ్లించాలని ఆ పార్టీ నేతలు కుట్రలు పన్నుతున్నారని చెప్పారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలన్న టీడీపీ అజెండా సహజంగానే వైసీపీ నేతలకు నచ్చదని చంద్రబాబు గుర్తుచేశారు. అందుకే అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారని తెలిపారు.



నలుగురు మయన్మార్ మాఫియా సభ్యులను ఉరితీసిన చైనా

- మయన్మార్ కేంద్రంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న కారణంతో శిక్ష అమలు
- ఆరుగురు చైనీయుల మరణానికి కారణమైనట్లు తేలడంతో గత ఏడాది ఉరిశిక్ష విధించిన కోర్టు
- శిక్షను అమలు చేసినట్లు స్థానిక మీడియా వెల్లడి

- మిగతా 2లో




# ఇదేనా మీ రూల్ ఆఫ్ లా?

## కూటమి ప్రభుత్వంపై రోజా ఫైర్

- చంద్రబాబు ప్రభుత్వంపై మాజీ మంత్రి రోజా తీవ్ర విమర్శలు
- అధికారంలోకి రాగానే వైసీపీ నేతలపై దాడులు చేస్తున్నారని ఆరోపణ
- పలువురు మాజీ మంత్రులు, నేతల ఇళ్లపై దాడులు జరిగాయన్న రోజా
- ఇదేనా చంద్రబాబు చెప్పిన 'రూల్ ఆఫ్ లా' అని సూటి ప్రశ్న
- సాక్షి, డెక్కన్ క్రానికల్ కార్యాలయాలపైనా దాడులని వెల్లడి

తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేత, మాజీ మంత్రి రోజా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైసీపీ నేతలు, వారి ఆస్తులు, పార్టీ కార్యాలయాలే లక్ష్యంగా దాడుల పరంపర కొనసాగుతోందని ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, ఈ పరిస్థితులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆమె డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్న 'రూల్ ఆఫ్ లా' (చట్టబద్ధమైన పాలన) ఇదేనా? అంటూ ఆమె సూటిగా ప్రశ్నించారు. ఈ సందర్భంగా, రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ నేతలపై జరిగిన దాడుల జాబితాను ఆమె వివరించారు. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేశ్, కొడాలి నాని, పేర్ని నాని, దాడిశెట్టి రాజా ఇళ్లతో పాటు, వల్లభనేని వంశీ, ముద్రగడ పద్మనాభం, భూమన కరుణాకర్ రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి వంటి సీనియర్ నేతల నివాసాలపై దాడులు జరిగాయని ఆమె పేర్కొన్నారు. హిందూపురం

- మిగతా 2లో



దలైలామాకు గ్రామీ అవార్డు.. తీవ్రంగా స్పందించిన చైనా

- 90 ఏళ్ల వయస్సులో మెడిటేషన్ అనే ఆల్బమ్‌కు అవార్డు
- దలైలామా పూర్తిగా ఆధ్యాత్మికపరమైన వ్యక్తి కాదన్న చైనా
- చైనా వ్యతిరేక వేర్పాటువాద కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపణ

- మిగతా 2లో



# ఏపీ, తెలంగాణలకు హైస్పీడ్ రైళ్లు గేమ్ ఛేంజర్.. బెంగళూరుకు 2 గంటల్లో చేరుకోవచ్చు

- తెలంగాణ, ఏపీ, తమిళనాడు మధ్య ఆర్థిక, హెల్త్ టూరిజం అభివృద్ధి చెందుతుందన్న కేంద్రమంత్రి
- బడ్జెట్‌లో తెలంగాణలో రైల్వే పనులకు రూ.5,454 కోట్లు కేటాయింపు
- హైదరాబాద్ నుంచి చెన్నై, పుణే, బెంగళూరుకు మూడు హైస్పీడ్ రైళ్లు రానున్నాయని వెల్లడి

హైస్పీడ్ రైళ్లు గంటకు 350 కిలోమీటర్ల వేగంతో పరుగు పెడతాయని, హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 2 గంటల్లో వెళ్లవచ్చని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. హైస్పీడ్ కారిడార్‌తో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మధ్య ఆర్థిక, హెల్త్ టూరిజం అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. బడ్జెట్‌లో తెలంగాణలో రైల్వే పనులకు రూ.5,454 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఈ హైస్పీడ్ రైళ్లు ఉభయ తెలుగు రాష్ట్రాలకు (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) గేమ్ ఛేంజర్‌గా మారతాయని వెల్లడించారు. హైదరాబాద్ నుంచి చెన్నై, పుణే, బెంగళూరుకు 3 హైస్పీడ్ రైళ్లు రానున్నాయని, దీంతో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 2 గంటల్లో వెళ్లవచ్చని అన్నారు. పుణేకు గంట 55 నిమిషాలు, చెన్నైకి 2 గంటల 55 నిమిషాల్లో చేరుకోవచ్చని అన్నారు.

# లోక్‌సభలో రాహుల్ vs కేంద్రం..

## ఆర్మీ మాజీ చీఫ్ పుస్తకంపై వాగ్వాదం

- భారత సరిహద్దుల్లోకి చైనా సైన్యం చొరబడిందనే మాట నేను చెప్పింది కాదు: రాహుల్ గాంధీ
- స్వయంగా ఆర్మీ మాజీ చీఫ్ నరవణే తన పుస్తకంలో రాశారని వెల్లడి
- ఈ పుస్తకం బయటకు వస్తే ప్రజలకు విషయం తెలుస్తుందని కేంద్రానికి భయం పట్టుకుందని వ్యాఖ్య
- దేశ భద్రతకు సంబంధించిన అంశాన్ని లోక్ సభలో లేవనెత్తేందుకు అనుమతించడం లేదని ఆరోపణ



లద్దాఖ్, డోక్లాం ప్రతిష్టంభన గురించి కాంగ్రెస్ ఎంపీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లోక్‌సభలో లేవనెత్తిన ప్రశ్నలతో గందరగోళం నెలకొంది. చైనా సైన్యం భారత సరిహద్దుల్లోకి చొరబడుతోందని ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవణే తన పుస్తకంలో రాసిన కొన్ని అంశాలను ఓ మ్యాగజైన్ ప్రచురించింది. ఆ వివరాలను రాహుల్ లోక్‌సభలో ప్రస్తావించారు. ఆయన వ్యాఖ్యలను కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్ ఖండించారు. రాహుల్ చెబుతున్న పుస్తకం ఇంకా పబ్లిష్ కాలేదని.. ప్రచురితం కాని పుస్తకంలోని అంశాల గురించి ఎలా మాట్లాడతారని

- మిగతా 2లో



## మాకు ప్రాణహాని ఉంది..

### భద్రత కోసం హైకోర్టును ఆశ్రయించిన జోగి రమేశ్


- ఇంటిపై టీడీపీ శ్రేణులు దాడి చేశాయని పిటిషన్‌లో ఆరోపణ
- దాడి జరుగుతున్నా పోలీసులు చోద్యం చూశారని ఆయన కుమారుడి ఆవేదన
- తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని కోర్టుకు విన్నపం
- లంచ్ మోషన్ పిటిషన్‌పై విచారణ జరపనున్న హైకోర్టు

వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ తన భద్రత విషయమై ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నంలోని తన నివాసంపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారని ఆరోపిస్తూ, తనకు భద్రత కల్పించాలని

- మిగతా 2లో

# పిలిస్తే సిట్ విచారణకు వెళ్లి సహకరిస్తా

- ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణపై కవిత కీలక వ్యాఖ్యలు
- విచారణ సుదీర్ఘంగా కొనసాగడంపై విమర్శలు
- త్వరగా పూర్తిచేసి దోషులను శిక్షించాలని డిమాండ్



తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ట్యాపింగ్ వ్యవహారంలో విచారణను తొందరగా ముగించి దోషులకు శిక్ష పడేలా చేయాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సిట్ విచారిస్తున్న విషయం తెలిసిందే

- మిగతా 2లో



# వైసీపీ నేతలతో సజ్జల, బొత్స కీలక భేటీ

- అంబటి అరెస్ట్ తో ఏపీ రాజకీయాల్లో ప్రకంపనలు
- తిరుమల ప్రతిష్ఠ దిగజార్చేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్న సజ్జల, బొత్స
- వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

### ఏపీలో శాంతి భద్రతల వైఫ్యల్యానికి ఎవరు కారణం?

శాంతి భద్రతల వైఫల్యం ఏ ప్రభుత్వానికైనా చెడ్డపేరు తెస్తుంది. ఎన్ని మంచి పనులు చేసినా.. ఎన్ని సంక్షేమ పథకాలను అమలు చేసినా శాంతిభద్రతల సమస్య మాత్రం ప్రజల్లోకి తొందరగా చొరబడుతుంది. గత వైసీపీ ప్రభుత్వంలోనూ అదే జరిగింది. నాడు జగన్ ప్రభుత్వం టీడీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించడంతో పాటు చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేయడంతో పాటు అనేక రకాలుగా లా అండ్ ఆర్డర్ సమస్య ఆ ప్రభుత్వం అధికారాన్ని కోల్పోవడానికి కారణమయింది. ఇప్పుడు అదే సమస్య కూటమి ప్రభుత్వంలోనూ స్పష్టంగా కనిపిస్తుంది. ఎక్కడ చూసినా ఘర్షణలు, హత్యలు, అత్యాచారాలు ప్రభుత్వానికి చెడ్డ పేరును తెచ్చిపెడుతున్నాయి.

**శాంతి భద్రతలు...**

నియోజకవర్గాల స్థాయిలో శాంతి భద్రతలు అదుపు తప్పడంపై వాటి ప్రభావం రానున్న ఎన్నికల్లో పడే అవకాశముందన్న ఆందోళన సీనియర్ నేతల్లోనూ వ్యక్తమవుతుంది. అందులో సోషల్ మీడియా వచ్చిన తర్వాత ఏ చిన్న సంఘటన జరిగినా వెంటనే ప్రజలకు తెలిసిపోతుంది. పోలీసులు కూడా నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సి ఉంటుంది. కానీ పోలీసుల తీరు కూడా ఆక్షేపణీయంగానే కనిపిస్తుంది. ఎవరి నుంచి వచ్చిన ఆదేశాలు మాత్రమే తెలియదు కానీ మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ ల ఇళ్లపై దాడులు జరిగిన సమయంలో పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరించడాన్ని ప్రజలు తప్పుపడుతున్నారు. ఇంత బీభత్సం జరుగుతున్నా పోలీసులు పట్టనట్లు వ్యవహరించడాన్ని బట్టి చూస్తే శాంతిభద్రతల పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

**వివాదానికి కారణమైన ఫ్లెక్సీలను...**

అసలు వివాదానికి కారణమైన ఫ్లెక్సీలను ముందుగానే పోలీసులు తొలగించి ఉంటే ఇంత రచ్చ జరిగి ఉండేది కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. రెండు రాజకీయ పార్టీల మధ్య పోరు ఉన్న సమయంలో వివాదాస్పద ఫ్లెక్సీలను పెడితే ఖచ్చితంగా అక్కడ శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతాయని చెప్పాలి. ఆ మాత్రం కూడా తెలియకుండా పోలీసు శాఖ నిద్రమత్తులో జోగుతుండటాన్ని ప్రతి ఒక్కరూ ప్రశ్నిస్తున్నారు. ఆరోజు ఫ్లెక్సీని తొలగించి ఉంటే ఇటు టీడీపీ, అటు వైసీపీ నేతల మధ్య ఘర్షణ తలెత్తి ఉండేది కాదని, అలాగే మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై దాడి చేసిన వారిపై కేసులు పెడితే జోగి రమేష్ ఇంటిపై దాడికి సాహసించి ఉండే వారు కాదన్నది కూడా అంతే వాస్తవమని న్యాయవాదులు కూడా చెబుతున్నారు. ఏపీలో జరుగుతున్న ఈ వివాదాలకు పోలీసుల వైఫల్యమే కారణమన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది.

# వైసీపీ నేతలతో సజ్జల, బొత్స కీలక భేటీ

ముఖ్యమంత్రి చంద్రబాబుపై మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలు ఏపీ రాజకీయాల్లో ప్రకంపనలు పుట్టించాయి. ఈ క్రమంలో రాంబాబుపై కేసు నమోదు కావడం... కోర్టు ఆయనకు రిమాండ్ విధించడం తెలిసిందే. తాజాగా, మరో మాజీ మంత్రి జోగి రమేశ్ పై కూడా కేసు నమోదయింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల వైసీపీ నేతలతో పార్టీ ముఖ్య నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, బొత్స సత్యనారాయణ భేటీ అయ్యారు. ఈ సమావేశానికి ఈ రెండు ఉమ్మడి జిల్లాలకు చెందిన మాజీ మంత్రులు, జిల్లాల పార్టీ అధ్యక్షులు, సమన్వయకర్తలు హాజరయ్యారు. ఇటీవల చోటు చేసుకుంటున్న అంశాలపై పార్టీ నేతలు ఎలా స్పందించాలనే అంశంపై సజ్జల, బొత్స సూచనలు చేశారు. తిరుమల ప్రతిష్ఠ దిగజార్చే విధంగా కూటమి వ్యవహరిస్తోందని ఈ సందర్భంగా నేతలు అన్నారు. కూటమి ప్రభుత్వ ఆగడాలను నిలువరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. వాస్తవాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని చెప్పారు. పార్టీ నేతలకు భద్రత కల్పించేందుకు పోరాటం చేయాలని తెలిపారు.

# ఇదేనా మీ రూల్ ఆఫ్ లా?

- మొదటి పేజీ తరువాయి
వైసీపీ కార్యాలయం, మార్గాని భరత్ కార్యాలయాలపై కూడా దాడి చేశారని తెలిపారు. అంతేకాకుండా, దేవినేని అవినాశ్, విడదల రజినిపై దాడికి యత్నించారని, ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్‌పై దాడి జరిగిందని వివరించారు. తనపై కూడా ఓ వ్యక్తిని ప్రయోగించి బూతులతో దాడి చేయిస్తున్నారని రోజా ఆవేదన వ్యక్తం చేశారు.
ఈ దాడులు కేవలం రాజకీయ నాయకులకే పరిమితం కాలేదని, పత్రికా కార్యాలయాలపైనా జరిగాయని రోజా ఆరోపించారు. సాక్షి, డెక్కన్ క్రానికల్ మీడియా సంస్థల ఆఫీసులపై జరిగిన దాడులను ఆమె తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో ఇంత జరుగుతున్నా ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని ఆమె ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చాక ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకోవడం దారుణమని, చంద్రబాబు పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతోందని రోజా విమర్శించారు. ఈ దాడులన్నింటికీ ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని ఆమె స్పష్టం చేశారు.

# లోక్‌సభలో రాహుల్ VS కేంద్రం..

## ఆర్మీ మాజీ చీఫ్ పుస్తకంపై వాగ్వాదం

- మొదటి పేజీ తరువాయి
రాజ్‌నాథ్ సింగ్ ప్రశ్నించారు.దీంతో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సభను అవమానించేలా రాహుల్ గాంధీ మాట్లాడుతున్నారని అమిత్ షా మండిపడ్డారు. స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ..వార్తాపత్రికల క్లిప్పింగులు, ప్రచురణ కాని పుస్తకాలకు సంబంధించిన విషయాలను లోక్‌సభలో ప్రస్తావించకూడదని రూల్ బుక్ నియమాలను చదివి వినిపించారు. రాష్ట్రపతి ప్రసంగంపై, ధన్యవాదాలు చెప్పే తీర్మానంపై మాట్లాడాలని రాహుల్‌కు సూచించారు. మరోవైపు రాహుల్ మాట్లాడుతుండగా మైక్ కట్ చేశారంటూ కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. దీంతో సభాకార్యకలాపాలకు అంతరాయం కలగడంతో లోక్‌సభను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

# పిలిస్తే సిట్ విచారణకు వెళ్లి సహకరిస్తా

- మొదటి పేజీ తరువాయి
. ఈ కేసులో అధికారులకు సహకరించేందుకు తాను సిద్ధమని చెప్పారు. అధికారులు పిలిస్తే తాను విచారణకు హాజరవుతానని కవిత తెలిపారు. ఈ మేరకు ఈ రోజు ఉదయం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ మొదలై రెండు సంవత్సరాలు గడించిందని గుర్తుచేశారు. విచారణ సుదీర్ఘంగా కొనసాగడంపై విమర్శలు గుప్పించారు. విచారణ ఇంకెప్పుడు ముగుస్తుందని, దోషులను ఎప్పుడు శిక్షిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సిట్ విచారణలో ఏం జరిగిందనే వివరాలను కేసీఆర్ బయటపెడతారని భావిస్తున్నట్లు ఆమె చెప్పారు. కేసు విచారణనే తప్పుబడుతున్నట్లు కేటీఆర్ మాట్లాడటం సరికాదని కవిత అభిప్రాయపడ్డారు. చట్టాలను గౌరవించాల్సిన బాధ్యత, అధికారులకు సహకరించాల్సిన విధి ప్రతీ పౌరుడిపైనా ఉందని వ్యాఖ్యానించారు. గుంట నక్కలతో కలిసి డ్రామాలాడుతోందంటూ కాంగ్రెస్ పార్టీపై ఆమె మండిపడ్డారు. తన ఫోన్ ను, తన భర్త ఫోన్ ను ట్యాప్ చేశారనే అనుమానిస్తున్నట్లు చెప్పిన కవిత.. సిట్ విచారణకు అధికారులు పిలిస్తే వెళతానని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# మాకు ప్రాణహాని ఉంది..

- మొదటి పేజీ తరువాయి
కోరుతూ ఆయన లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు ఆయన కుమారుడు జోగి రోహిత్ కుమార్ కూడా హైకోర్టులో మరో లంచ్ మోషన్ పిటిషన్ వేశారు.తమ ఇంటిపై దాడి జరిగే అవకాశం ఉందని పోలీసులకు ముందుగానే సమాచారం ఇచ్చినా వారు స్పందించలేదని రోహిత్ తన పిటిషన్‌లో ఆరోపించారు. గుంపులుగా వచ్చిన వ్యక్తులు దాడి చేస్తుంటే, అక్కడే ఉన్న పోలీసులు నిలువరించకుండా కేవలం ప్రేక్షకపాత్ర పోషించారని ఆయన పేర్కొన్నారు. తమకు, తమ కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని, వెంటనే భద్రత కల్పించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

దాడికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఆధారాలుగా కోర్టుకు సమర్పిస్తున్నట్లు పిటిషన్‌లో తెలిపారు. ఈ రెండు పిటిషన్లపై ఉన్నత న్యాయస్థానం కాసేపట్లో విచారణ జరపనుంది.

# నలుగురు మయన్మార్ మాఫియా సభ్యులను ఉరితీసిన చైనా

మయన్మార్ కేంద్రంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న కారణంగా నలుగురికి చైనాలో ఉరిశిక్ష అమలు చేశారు. ఈ మేరకు బాయి ఫ్యామిలీ మాఫియాకు చెందిన నలుగురికి ఉరిశిక్ష అమలు చేసినట్లు షెంజెన్ ఇంటర్మీడియేట్ పీపుల్స్ కోర్టు వెల్లడించింది. హత్యలు, టెలికాం మోసం, డ్రగ్ ట్రాఫికింగ్‌తో పాటు ఆరుగురు చైనీయుల మరణానికి కారణమైనట్లు తేలడంతో గత ఏడాది కోర్టు ఈ శిక్ష విధించింది. తాజాగా దానిని అమలు చేసింది.
ఆన్‌లైన్ మోసాలతో పాటు వివిధ కేసులు ఎదుర్కొంటున్న ఈ గ్యాంగులపై చైనా కొంతకాలంగా తీవ్ర చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా మయన్మార్‌కు చెందిన నేర ముఠాకు చెందిన సభ్యులకు మరణశిక్షను అమలు చేసినట్లు ఇటీవల స్థానిక మీడియా పేర్కొంది.
వేల కోట్ల రూపాయల కుంభకోణాలు, జూద కార్యకలాపాలకు పాల్పడుతున్న ఈ మాఫియా, తమ వద్ద పనిచేస్తూ తప్పించుకునేందుకు ప్రయత్నించిన 14 మంది చైనీయుల ప్రాణాలను తీసిందనే ఆరోపణలు ఉన్నాయి. ఈక్రమంలో ముఠాలోని నలుగురికి శిక్షను అమలు చేసినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. అయితే ఈ శిక్షను ఎప్పుడు అమలు చేశారనేది తెలియరాలేదు.

# దలైలామాకు గ్రామీ అవార్డు.. తీవ్రంగా స్పందించిన చైనా

టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా ప్రతిష్ఠాత్మక గ్రామీ అవార్డు గెలుచుకున్నారు. బెస్ట్ ఆడియో బుక్, నెరేషన్ అండ్ స్టోరీ టెల్లింగ్ రికార్డింగ్ జాబితాలో ఆయన ఈ అవార్డును సొంతం చేసుకున్నారు. 90 ఏళ్ల వయస్సులో 'మెడిటేషన్' అనే ఆల్బమ్‌కు గాను దలైలామాను ఈ అవార్డు వరించింది. దలైలామాకు గ్రామీ అవార్డు ఇవ్వడాన్ని చైనా తీవ్రంగా ఖండించింది. దీనిని ఉపయోగించుకుని చైనా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటాన్ని వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొంది.దలైలామా పూర్తిగా ఆధ్యాత్మికపరమైన వ్యక్తి కాదని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ ఓ మీడియా సమావేశంలో అన్నారు. మతం ముసుగులో చైనా వ్యతిరేక వేర్పాటువాద కార్యకలాపాలకు పాల్పడుతున్న రాజకీయ ప్రవాసి అని ఆయనపై ఆరోపణలు గుప్పించారు.
ఈ అవార్డును బీజింగ్ వ్యతిరేక కార్యకలాపాలకు ఒక సాధనంగా ఉపయోగించుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. దలైలామా మతం ముసుగులో చైనా వ్యతిరేక వేర్పాటువాద కార్యకలాపాలను ప్రోత్సహించే వ్యక్తి అన్నారు.
తనకు గ్రామీ అవార్డు రావడంపై దలైలామా స్పందించారు. ఇది తన వ్యక్తిగత విజయంగా చూడటం లేదని అన్నారు. శాంతి, కరుణ, పర్యావరణంపై శ్రద్ధ, మానవత్వం అనేవి మానవాళి శ్రేయస్సుకు అవసరమని పేర్కొన్నారు. గ్రామీ గుర్తింపు ఈ సందేశాలను మరింత విస్తృతంగా వ్యాప్తి చేయడంలో సహాయపడుతుందని విశ్వసిస్తున్నానని పేర్కొన్నారు.

## చంద్రబాబు ఆత్మరక్షణలో పడ్డారు: భూమన కరుణాకర్ రెడ్డి



తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి విషయంలో సీబీఐ నివేదిక వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఆత్మరక్షణలో పడ్డారని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. దీని నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే వైసీపీ నేతలపై దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. నేషనల్ డెయిరీ డెవలప్ మెంట్ బోర్డు ఇచ్చిన నివేదిక ప్రకారమే మాట్లాడానని చంద్రబాబు అంటున్నారని భూమన ఎద్దేవా చేశారు. టీటీడీకి ఈ బోర్డును పరిచయం చేసిందే జగన్ అని చెప్పారు. నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసే అవకాశమే లేదని సీబీఐ తెలిపిందని అన్నారు. చంద్రబాబు హయాంలోనే బోలేబాబా డెయిరీ నుంచి టీటీడీ నెయ్యి కొనుగోలు చేసిందని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక బోలేబాబాను డిస్ క్వాలిఫై చేశామని అన్నారు.
తాను చేసిన వ్యాఖ్యలకు అంబటి రాంబాబు క్షమాపణ చెప్పినప్పటికీ దాడులు చేశారని భూమన మండిపడ్డారు. అంబటి ఇంటి మీదకు 3 వేల మంది రౌడీలను పంపించారని అన్నారు. జోగి రమేశ్ ఇంటిపై కూడా ఉద్దేశపూర్వకంగానే దాడి చేశారని విమర్శించారు. పక్కా ప్రణాళిక ప్రకారమే అంబటి రాంబాబు, జోగి రమేశ్ ఇళ్లపై దాడులు జరిగాయని అన్నారు.

## కాపుల గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదు: నిమ్మల రామానాయుడు



కాపుల సంక్షేమం, అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక అర్హత వైసీపీకి ఏమాత్రం లేదని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాపుల భవిష్యత్తు ఎప్పటికీ తెలుగుదేశం పార్టీతోనే ముడిపడి ఉందని ఆయన స్పష్టం చేశారు. సోమవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ నేతల తీరుపై తీవ్ర విమర్శలు చేశారు.తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే మాజీ మంత్రి అంబటి రాంబాబును అడ్డం పెట్టుకుని వైసీపీ నీచ రాజకీయాలు చేస్తోందని రామానాయుడు ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దివంగత తల్లిదండ్రులను ఉద్దేశించి అంబటి వాడిన భాష సభ్యసమాజం తలదించుకునేలా ఉందని, అంత దారుణంగా మాట్లాడుతున్నా జగన్ ఎందుకు వారించలేదని ప్రశ్నించారు. ఇది జగన్ దర్శకత్వంలోనే జరుగుతున్న డ్రామా అని స్పష్టమవుతోందన్నారు.

**చరిత్రను గుర్తుంచుకోవాలి**

చరిత్రను గుర్తుచేస్తూ.. బ్రిటిష్ కాలం నుంచి ఉన్న కాపు రిజర్వేషన్లను కాంగ్రెస్ ముఖ్యమంత్రులు నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి రద్దు చేస్తే, దామోదరం సంజీవయ్య, చంద్రబాబు మాత్రమే వాటిని పునరుద్ధరించారని రామానాయుడు తెలిపారు. చంద్రబాబు ఎంతో కష్టపడి కాపులకు రిజర్వేషన్లు కల్పిస్తే, అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ వాటిని రద్దు చేసి కాపులకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. కాపుల ఆరాధ్య దైవం వంగవీటి మోహన రంగాను 'రౌడీ' అని, 'చంపితే తప్పేంటి' అని అన్న గౌతమ్ రెడ్డికి ఆరు నెలల్లోనే ఫైబర్ నెట్ ఛైర్మన్ పదవి ఇచ్చి జగన్ సత్కరించారని మండిపడ్డారు. రంగా హత్యలో నిందితులుగా ఉన్నవారు వైసీపీ ప్రెస్‌మీట్లలో పక్కన కూర్చుని నీతులు చెబుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. కాపుల కోసం పోరాడుతానన్న ముద్రగడ పద్మనాభం తన పేరు చివర 'రెడ్డి' అని తగిలించుకున్న తర్వాత కాపుల గురించి మాట్లాడటం ఆయన మనస్సాక్షికే వదిలేస్తున్నామన్నారు.

**బూతుల వల్లే వైసీపీ ఓటమి**

అంబటి రాంబాబు, జోగి రమేశ్, కొడాలి నాని వంటి నేతల బూతుల పురాణం కారణంగానే వైసీపీ 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయిందని, అధికారం కోల్పోయినా వారిలో మార్పు రాలేదని విమర్శించారు. లోకేశ్ పై జోగి రమేశ్ చేసిన వ్యాఖ్యలను మహిళాలోకం అసహ్యించుకుంటోందన్నారు. తప్పు చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటే దానికి కులాన్ని ఆపాదించడం వైసీపీ దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పల్నాడు వెళ్లిన టీడీపీ నేతలు బొండా ఉమ (కాపు), బుద్ధా వెంకన్న (బీసీ)పై రాడ్లతో దాడి చేయించినప్పుడు జగన్‌కు వారి కులాలు గుర్తుకు రాలేదా అని నిలదీశారు.

**చట్టం తనపని తాను చేసుకుపోతుంది**

గతంలో టీడీపీ కార్యాలయంపై వైసీపీ గూండాలు దాడి చేసినప్పుడు అధికారంలో ఉన్న బొత్స సత్యనారాయణకు చట్టం గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. చంద్రబాబు ఎప్పుడూ శాంతిభద్రతలకే పెద్దపీట వేస్తారని, తప్పు ఎవరు చేసినా చట్టం తన పని తాను చేసుకుపోతుందని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని రామానాయుడు గుర్తుచేశారు. రంగాను అవమానించిన వారికి అండగా నిలుస్తున్న వైసీపీకి ఆయన పేరును ఉచ్ఛరించే హక్కు కూడా లేదని, అభివృద్ధిని పక్కనపెట్టి కులాల మధ్య చిచ్చు పెట్టడమే జగన్ నైజమని మంత్రి తీవ్రంగా విమర్శించారు.

# దిగజారుతున్న కాఫీ ధరలు.. రైతుల్లో కలవరం





మన్యం కాఫీ కొనుగోళ్లపై ప్రభావం

**స్టాఫ్ రిపోర్టర్(మాదిరి చంటిబాబు)పెన్ పవర్,గూడెం కొత్త వీధి,ఫిబ్రవరి 2:**అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రధాన వాణిజ్య పంటగా నిలిచిన కాఫీ పంట కొనుగోలు ధరలు ఒక్కసారిగా పడిపోవడంతో గిరిజన రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో కాఫీ ధరలు తగ్గుముఖం పట్టడంతో మన్యం ప్రాంతంలో కాఫీ క్రయవిక్రయాలపై తీవ్ర ప్రభావం పడుతోంది.

జిల్లాలోని 11 మండలాల పరిధిలో సుమారు పది లక్షల ఎకరాల్లో పూర్తి సేంద్రియ విధానంలో కాఫీ సాగు చేస్తున్నారు. ఐటీడీఏ ప్రోత్సాహంతో గిరిజనులు ఈ కాఫీ పంటను ప్రధాన వాణిజ్య పంటగా అభివృద్ధి చేసుకున్నారు. 'అరకు కాఫీ' బ్రాండ్‌కు దేశ, విదేశాల్లో మంచి గుర్తింపు ఉండటంతో ప్రభుత్వమూ ప్రత్యేకంగా ప్రోత్సహిస్తోంది.ప్రతి ఏడాది డిసెంబర్ నుంచే కాఫీ విక్రయాలు ప్రారంభమవుతాయి. అయితే ఈ ఏడాది దిగుబడి ఆలస్యం కావడంతో జనవరి నుంచి విక్రయాలు మొదలయ్యాయి. ప్రారంభంలో అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా వ్యాపారులు కిలో గుల్ల కాఫీకి రూ.240గా ధర నిర్ణయించారు. ఐటీడీఏ, జిసిసి సంయుక్తంగా గిరిజన రైతుల నుంచి నేరుగా కిలో రూ.270కు కొనుగోలు ప్రారంభించాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో కాఫీ ధరలు తగ్గడంతో మన్యంలోనూ ప్రభావం కనిపిస్తోంది. ఈశాన్య రాష్ట్రాల నుంచి అధిక దిగుబడి రావడంతో డిమాండ్ తగ్గిందని వ్యాపారులు



చెబుతున్నారు. రెండు రోజుల కిందట వరకు కిలో రూ.265--270 పలికిన ధర ఒక్కసారిగా రూ.250కు పడిపోయింది. కిలోకు రూ.15 మేర తగ్గడంతో కాఫీ వ్యాపారం మందగించింది.గతంలో కాఫీ కొనుగోళ్లు ప్రధానంగా దళారుల చేతుల్లోనే ఉండేవి. రైతులకు ముందస్తుగా అప్పులు ఇచ్చి, పంట చేతికి వచ్చిన సమయంలో తాము నిర్ణయించిన ధరలకే కొనుగోలు చేసేవారు. ఈ దళారీ వ్యవస్థ వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు.

# పెన్ పవర్

## ఉత్తరాంధ్ర

శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# బాల్య వివాహ రహిత జిల్లాగా మారుద్దాం

- బహిరంగ మలవిసర్జనపై అవగాహన కల్పించాలి
- బాల్య వివాహాల నిర్మూలనకు మహిళా పోలీసులు కృషి చేయాలి
- జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్. పార్వతీపురం, ఫిబ్రవరి 02 :** జిల్లాలో బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా మహిళా సంరక్షణ కార్యదర్శులు ( మహిళా పోలీసులు ) క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర్ రెడ్డి ఆదేశించారు.

గ్రామ/వార్డు పరిధిలోని మహిళలు, చిన్నారుల భద్రతను మహిళా పోలీసులు పర్యవేక్షించాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలని, మహిళలపై జరిగే వేధింపులు, గృహహింస వంటి కేసుల్లో బాధితులకు అండగా ఉండి, వారికి చట్టపరమైన అవగాహన కల్పించాలని సూచించారు. గంజాయి విక్రయాలు, జూదం, అక్రమ మద్యం గురించి స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో పాటు అపరిచిత వ్యక్తులు లేదా అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలని అన్నారు. సైబర్ నేరాల పట్ల మహిళలకు అవగాహన కల్పించాలని, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, గర్భిణీలు మరియు బాలింతల ఆరోగ్యం, పౌష్టికాహారంపై నిఘా పెట్టాలని పేర్కొన్నారు. బహిరంగ మలవిసర్జన వలన సమాజంలో అగౌరవంతో పాటు ఆరోగ్యానికి సంబంధించిన వివిధ వ్యాధులు వ్యాపిస్తాయని, భూగర్భ జలాలు కలుషితం అవుతాయని అన్నారు. ప్రతి ఇంట్లో వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకొని వాడుకలోకి తీసుకురావాలని, స్వచ్ఛ భారత్' వంటి పథకాలను ఉపయోగించుకుని గ్రామాలను బహిరంగ మలవిసర్జన రహితంగా మార్చాలని ఆదేశించారు. అలాగే ప్లాస్టిక్ అనేది భూమికి పెను శాపంగా మారిందని, ఇది కొన్ని వందల ఏళ్ల వరకు భూమిలో కరిగిపోదన్నారు. ప్లాస్టిక్ వల్ల డ్రైనేజీలు పూడికపోవడం, జంతువులు ప్రాణాలు కోల్పోవడం, మైక్రో-ప్లాస్టిక్స్ ద్వారా మన ఆహారంలోకి విషతుల్యాలు చేరుతాయని తెలిపారు. ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ ను నిషేధించి, గుడ్డ సంచిని వెంట తీసుకు వెళ్లేలా అవగాహన కల్పించాలని చెప్పారు.

# అక్రమ జనరేటర్ షెడ్డును నిర్మాణం.



**అరకులోయ పెన్ పవర్ 2**:అరకులోయ మండల కేంద్రంలో ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా జనరేటర్ షెడ్డును ఇండియన్ పెట్రోల్ బంక్ యాజమాన్యం నిర్మించుకున్నారని పెదలపుడు గ్రామపంచాయతీ పాలకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ ఉపకార్యాలయం ప్రధాన గేటుకు అనుకొని అక్రమంగా జనరేటర్ షెడ్డు నిర్మించుకున్నారని, రహదారి భవనాల శాఖ అధికారుల అనుమతులు లేకుండా జనరేటర్ షెడ్ ఎలా నిర్మిస్తారని స్థానిక పాలకులు స్థానిక గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇండియన్ పెట్రోల్ బంక్ నిర్వహణకు కేటాయించిన స్థలంలోనే జనరేటర్ షెడ్డు నిర్మించుకోవాలని, పెట్రోల్ బంక్ స్థలం ఉండగా ఇంజనీరింగ్ కార్యాలయం ఎదురుగా ప్రధాన రహదారి పైన అక్రమ జనరేటర్ నిర్మించుకోవడం పై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన చలనం లేదని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. రహదారి భవనాల శాఖ అధికారులు జోక్యం చేసుకొని అక్రమ జనరేటర్ షెడ్డును తక్షణమే తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రధాన రహదారిలో అనుకొని జనరేటర్ షెడ్డు ఏర్పాటు చెందిన ఇండియన్ పెట్రోల్ బంక్ యాజమాన్యంపై పంచాయతీ అధికారులు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని, అక్రమ నిర్మాణాలపై పంచాయతీ అధికారులు, రెవెన్యూ అధికారులు, చూస్తూ ఊరుకొంటున్నారని పట్టించుకోవటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అక్రమ జనరేటర్ షెడ్ పై పంచాయితీ అధికారులు నోటీసు జారుచేసి తక్షణమే జనరేటర్ షెడ్డును తొలగించాలని స్థానికులు ఒక పత్రిక ప్రకటనలో వారు విజ్ఞప్తి చేస్తారు.

# గడువు మిస్ అయితే కఠిన చర్యలు తప్పవు





- జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ స్పష్టం
- పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంపై అధికారులకు హెచ్చరిక
- పద్మనాభం వ్యవసాయ శాఖ ఏవోకు నోటీసు జారీకి ఆదేశం
- ఒకే రోజు 444 వినతుల స్వీకరణ
- విశాఖ ఉత్సవ్ విజయానికి అధికారుల ప్రశంసలు, ఐఎఫ్ఆర్‌కు సన్నద్ధత పిలుపు

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఫిబ్రవరి 02 :**ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించడం లో విఫలమైతే సంబంధిత అధికారులపై కఠిన శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ స్పష్టంగా హెచ్చరిం చారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన అధికారు లతో సమీక్ష నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు.అర్జీలు పదే పదే రీ-ఓపెన్ అయ్యే పరి స్థితి రాకుండా నాణ్యమైన, శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. గడువు దాటినా విన తులను పట్టించుకోని అధికారులపై కఠిన చర్య లు తీసుకుంటామని కలెక్టర్ తేల్చి చెప్పారు.

ముఖ్యంగా రెవెన్యూ క్లినిక్‌లకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారంలో జాప్యం సహిం చబోమని స్పష్టం చేశారు. గ్రామీణ మండలాల్లో భూ సమస్యలపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.ప్రజల వినతు లకు సరైన సమాధానం ఇవ్వకుండా పదేపదే రీ-ఓపెన్‌కు కారణమవుతున్న పద్మనాభం వ్య వసాయ శాఖ ఏవోకు నోటీసు జారీ చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని కలెక్టర్ ఆదే శించారు. 48 గంటల్లోగా పూర్తి వివరణ తీసు కుని నివేదిక సమర్పించాలని సూచించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ విద్యాధరి, జీవీఎంసీ అదనపు కమిషనర్ సత్యవేణిలతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 444 వినతులు అందగా, వాటిలో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 154, జీవీఎంసీకి చెందినవి 105, పోలీసు శాఖకు 10, ఇతర శాఖలకు చెందినవి 175 ఉన్నట్లు అధికా రులు తెలిపారు.విశాఖ ఉత్సవ్ నిర్వహణకు అభినందనలు

పీజీఆర్ఎస్ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన విశాఖ ఉత్సవ్‌ను అధి కారులు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారని ప్రశంసించారు. అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించినం దుకు అధికారులందరికీ అభినందనలు తెలిపా రు. ఇదే ఉత్సాహంతో రాబోయే ఐఎఫ్ఆర్ కార్యక్రమాన్ని కూడా విజయవంతంగా నిర్వహిం చేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులను కోరారు.

'స్వర్ణ గ్రామం -- స్వర్ణ వార్డు' పోస్టర్ ఆవిష్కరణ

స్వర్ణాంధ్ర మన సంకల్పం -- విజన్ ఏ2047 లక్ష్యంగా గ్రామ, వార్డు సచివాలయాల పేర్ల మార్పును ప్రతిబింబించే 'స్వర్ణ గ్రామం -- స్వర్ణ వార్డు' పోస్టర్‌ను జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కలిసి ఆవిష్కరించారు. గ్రామ/వార్డు సచివాల య కోఆర్డినేటర్ ఉషారాణి పోస్టర్‌ను అందజే యగా, పలువురు అధికారులు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# అసభ్య రాజకీయాలకు తావు లేదు

వైసీపీ గుర్తింపు రద్దుపై ఈసీకి లేఖ ఎమ్మెల్యే గంటా

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఫిబ్రవరి 02 :** రాష్ట్ర రాజకీయాల్లో అసభ్య వ్యాఖ్యలు, కుల రాజకీయాలను ప్రోత్సహిస్తూ భవిష్యత్ తరా లకు తప్పుడు సందేశం ఇస్తున్న వైసీపీ నేతల వ్యవహార శైలిని టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివా సరావు తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన అనుచిత వ్యాఖ్యల ను నిరసిస్తూ సోమవారం విశాఖలోని ఎంవీపీ కాలనీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.వైసీపీ నేతల వ్యాఖ్యలు ప్రజా స్వామ్య విలువలకు విరుద్ధంగా ఉన్నాయని పేర్కొంటూ, ఆ పార్టీ గుర్తింపును రద్దు చేయా లంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాయ నున్నట్లు గంటా వెల్లడించారు. ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి సహా అంబటి రాంబాబు, కొడాలి నాని, పేర్ని నాని, జోగి రమే ష్, రోజా తదితరులు గతంలో చేసిన వివాదా స్పద వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను మీడియాకు ప్రదర్శించారు.నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన వ్యక్తిపై ఇష్టానుసారంగా మాట్లాడితే ప్రజలు సహించరని ఆయన హెచ్చరించారు. గతంలో చంద్రబాబు నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సందర్భంలో వైఎస్సార్ స్వయంగా అసెం బ్లీలో క్షమాపణలు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు.కేవలం రాజకీయ ఉనికిని కాపాడు కోవడానికే వైసీపీ నేతలు కులాలను ముందుకు తెచ్చి రాజకీయాలు చేస్తున్నారని గంటా ఆరో పించారు. గతంలో విశాఖ విమానాశ్రయం లో చంద్రబా బు నాయుడిని అడ్డుకున్న ఘటనను ఆయన తీవ్రంగా తప్పుబట్టారు.అదేవిధంగా, టీడీపీ కార్యకర్త వైఎస్ భారతి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని పార్టీ నుంచి సస్పెండ్ చేయడమే కాకుండా, అరెస్టు చేయించి జైలుకు పంపిన నాయకుడు చంద్రబాబు నాయుడేనని గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.



క్రమశిక్షణ, విలువ లతో కూడిన రాజకీయాలకే టీడీపీ ఎ ప్పుడూ ప్రాధాన్యం ఇస్తుందని ఆయన తెలిపా రు.

## చెట్టుపై నుంచి పడి యువకుడికి తీవ్ర గాయాలు



**గూడెం కొత్త వీధి, పెన్ పవర్, ఫిబ్రవరి 2:** గూడెం కొత్తవీధి మండలం దుప్పులవాడ గ్రామంలో సోమవారం ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడి ఓ యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కేలేబు భాస్కర్ (40) కూర కోసం పనసకాయ కోయడానికి చెట్టెక్కాడు. ఈ క్రమంలో కాలుజారి కింద పడిపోవడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న ఆశా వర్కర్ నాగమణి వెంటనే సీలేరు సిఎస్ఆర్ సిబ్బంది గణేష్‌కు సమాచారం అందించారు. దాంతో ఏపీజెన్కో ఆధ్వర్యంలో నడుస్తున్న భవ్య హెల్త్ సంస్థకు చెందిన సిఎస్ఆర్ అంబులెన్స్‌ను సిబ్బంది డ్రైవర్ భీష్మ కుమార్, ఈఎంటి రవిచంద్ర దుప్పులవాడ గ్రామానికి తీసుకెళ్లి క్షతగాత్రుడిని సీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ డాక్టర్ పి. నారాయణ ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం, మెరుగైన వైద్య సేవల కోసం క్షతగాత్రుడిని సిఎస్ఆర్ అంబులెన్స్‌లో నర్సీపట్నం ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

## వ్యవస్థాగత సంస్కరణలకు అనుకూలమైన బడ్జెట్ ఇది.. భీశెట్టి బాబ్జీ




**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్. విజయనగరం ఫిబ్రవరి 2 :** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన 53,47,315 కోట్ల రూపాయల 2026-27 బడ్జెట్ భారత దేశంలో వ్యవస్థాగత సంస్కరణలకు అనుకూలంగా ఉందని ఇది జీడీపీ వృద్ధి రేటు మెరుగుకు ఉపయోగపడుతుందని లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. దాదాపు 33 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్న సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమలు(ఎంఎస్ ఎంఈలు) జీడీపీ లో 31 శాతానికి పైబడిన వాటాతో భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నాయని బడ్జెట్ లో ప్రకటించిన 10 వేల కోట్ల ప్రత్యేక నిధి సూక్ష్మ సంస్థలను ఆదుకుంటుందని,10 వేల కోట్ల రూపాయలు బయోఫార్మా శక్తి వ్యూహం,40 వేల కోట్ల తో భారత సెమికండక్టర్ మిషన్ 2.0 ప్రకటన కూడా అవసరమని,ఆధునిక ఆర్థిక వ్యవస్థకి ప్రాణదారలవంటి అరుదైన ఖనిజాల కోసం విదేశాలపై ఆధారపడకుండా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, ఒడిశాలలో రేర్‌ఎర్త్ కారిడార్ల ఏర్పాటుకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవడం మంచిదని, ఏడు హైస్పీడ్ ట్రైన్ ల్లో మూడు తెలంగాణ నుండి ఆంధ్రప్రదేశ్ మీదుగా ఇతర ప్రాంతాలకు ఇవ్వడం,భారత దేశంలోని డేటా సెంటర్ల సాయంతో విశ్వవ్యాప్తంగా క్లౌడ్ సేవలు అందించే విదేశీ కంపెనీలకు 2047 వరకూ పన్ను మినహాయింపు ఇవ్వడం తో డేటా సెంటర్లను ప్రోత్సహిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల కి మంచి జరుగుతుందని అన్నారు, వ్యవసాయం, గ్రామీణ అభివృద్ధి, రైల్వే, వైద్య రంగం,విద్యారంగం,రోడ్లు రవాణా తో పాటుగా రక్షణ రంగానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయింపులు చేశారని పోలవరానికి 3,320 కోట్లు, అమరావతి కి 1561 కోట్లు కేటాయించడం అభినందనీయమని భీశెట్టి అన్నారు, వరుసగా తొమ్మిదోసారి కేంద్ర బడ్జెట్ ని ప్రవేశపెట్టిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ని భీశెట్టి అభినందించారు. ఈ సమావేశంలో పౌర వేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ పిడకల ప్రభాకరరావు, ఉపాధ్యక్షుడు తుమ్మగంటి రామ్మోహన్ రావు,ఇప్పలవలస గోపి, జగదీష్, లోక్ సత్తా నాయకులు తాట్రాజు రాజారావు, బోర రమేష్, పి.ఎల్.ఎన్.రాజు, పతివాడ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ లక్ష్యసాధనకు మార్గదర్శకంగా కేంద్ర బడ్జెట్ -పల్లా శ్రీనివాసరావు



**గాజువాక :పెన్ పవర్ ,ఫిబ్రవరి 02 :** కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆంధ్ర రాష్ట్రానికి బహుళ ప్రయోజనాలు చేకూరుస్తుందని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు , గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం పల్లా మాట్లాడుతూ ఈ బడ్జెట్ కేవలం సమాహారం కాదని వికసిత్ భారత్ లక్ష్యసాధన కు మార్గదర్శకంగా ఉందని అన్నారు. పెట్టుబడులు ఉపాధి మౌలిక సదుపాయాలు మరియు సామాజిక న్యాయానికి సమతుల్యత కల్పించే విధంగా ఆర్థిక ప్రణాళిక చేశారని ప్రశంసించారు. రాజధాని అమరావతి అభివృద్ధికి రూ 1,128.91 కోట్ల రూపాయల నిధులు కేటాయించడం రాష్ట్రానికి శుభసూచికమని అన్నారు. సమగ్ర పట్టణ అభివృద్ధి కోసం అదనంగా 432 కోట్ల రూపాయలు కేటాయించడం హర్షించదగ్గ విషయం అని అన్నారు. కార్యక్రమంలో టిడిపి కార్పొరేటర్ గల్లా చిన్న, అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బత్తుల తాతబాబు, వివిధ వార్డుల అధ్యక్షులు గోమాడ వాసు సింగూరు అనంత్ నల్లూరు సూర్యనారాయణ క్రరీ దశయేంద్ర, నాయకులు వేగుంట శ్రీనివాస్, పప్పు రాజారావు, రత్నకాంత్, బాషా చంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞాన్ విద్యార్థులు ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌కు ఇండస్ట్రియల్ విజిట్






**కూర్మన్నపాలెం :పెన్ పవర్ ,ఫిబ్రవరి 02 :** విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆటోనమస్, దువ్వాడలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మూడో సంవత్సరం విద్యార్థులకు ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్, అచ్చుటాపురం, విశాఖపట్నంకు ఇండస్ట్రియల్ విజిట్ నిర్వహించారు.


ఈ ఇండస్ట్రియల్ విజిట్ ద్వారా విద్యార్థులకు ఆధునిక పరిశ్రమల విధానాలు, నూతన సాంకేతిక ఆవిష్కరణలపై ప్రత్యక్ష అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 57 మంది విద్యార్థులు పాల్గొనగా, ఈసీఎం విభాగ అధ్యాపకులు చె. గాయత్రి మరియు ఎ. సర్వాణి విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్, విశాఖపట్నం సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి ఆధునిక సాంకేతిక సహాయం, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, పరిశ్రమల శిక్షణ కార్యక్రమాలు అందించే ప్రముఖ సంస్థగా నిలిచింది. ఈ విజిట్ సందర్భంగా విద్యార్థులకు తయారీ ప్రక్రియలు, ఆధునిక యంత్రాలు, ఆవిష్కరణల ఆధారిత పరిష్కారాలపై ప్రత్యక్షం గా అవగాహన కల్పించారు .

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. జె. సుధాకర్, రెక్టర్ డా. వి. మధుసూధన్ రావు, మరియు ఈసీఎం విభాగాధిపతి డా. హెచ్. దేవన్నలు ఇండస్ట్రియల్ విజిట్‌ను సాఫీగా నిర్వహించినందుకు మరియు విద్యార్థులకు విలువైన పరిశ్రమల అవగాహన అందించినందుకు ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు

## గిరిజనుల భూములు జోలికి వస్తే ఉపేక్షించేది లేదు.





- గుజ్జిలి గ్రామంలో నూతన అంగన్వాడి భవనం ప్రారంభం.
- క్రీడలతో మానసిక ఉల్లాసం.
- అరుకు ఎమ్మెల్యే రేగం మత్స్య లింగం.

**అనంతగిరి పెన్ పవర్ ఫిబ్రవరి 02.** టూరిజం హిల్ రిసార్ట్ పేరుతో గిరిజన భూముల జోలికి వస్తే సహించేది లేదని అరకు శాసనసభ్యులు రేగం మత్స్యలింగం అన్నారు. అనంతగిరి మండలంలోని సోమవారం ఆయన గుమ్మ కోట బీంపోలు పంచాయతీలో వైసిపి మండల అధ్యక్షుడు కొర్ర సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ నీలవేణి, గుమ్మ కోట పంచాయితీ సర్పంచ్ పాగి అప్పారావు, అనంతగిరి మండల కార్యదర్శి మధుసూదన్, ఎస్టీ జనరల్ సెక్రెటరీ పార్టీ సీనియర్ కార్యకర్త శెట్టి లక్ష్మణ రావు, వైయస్సార్సీపి పార్టీ శ్రేణులు కార్యకర్తలతో పర్యటించారు. బీంపోలు పంచాయతీలో దశాబ్దపు ఏళ్ల నుంచి 10 కుటుంబాలు గిరిజన కొండపోడు భూములపై వ్యవసాయం మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. భీంపోలు పంచాయతీ నందకోట పరిధిలో 22, 24, 28, సర్వే నెంబర్లు సుమారు 40 ఎకరాల విస్తీర్ణ భూమిలో గిరిజన కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. 2022 సంవత్సరంలో తాము సాగులో ఉన్న భూములను తక్షణమే విడిచిపెట్టి వేరే ప్రాంతానికి వెళ్లాలని పై స్థాయి నుంచి అధికారులు నోటీసులు పంపించారు. దాంతో జిల్లా కలెక్టర్ స్పందన కార్యక్రమానికి కూడా తాము ఫిర్యాదు చేసినట్టు సోమవారం భీంపోలు పంచాయతీలో పర్యటించిన స్థానిక ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంకు గ్రామస్తులు తమ భూమిని తమకు ఇప్పించాలని భీంపోలు, నంద కోట గిరిజన ప్రాంత ప్రజలు వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతూ రైతులు సాగులో ఉన్న భూములను తమ ఇల్లులను విడిచిపెట్టి ఎక్కడికి వెళ్లవలసిన అవసరం లేదని తెలిపారు. వెంటనే కలెక్టర్ తో మాట్లాడి తమ సమస్యకు పరిష్కారం చూపించే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భూములు నష్ట పోతున్న రైతులు పాల్గొన్నారు.

నూతన అంగన్వాడి భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే.

బాల్య విద్య మరియు సంరక్షణను మెరుగుపరచడంలో ఒక పెద్ద అడుగులో ఉందని అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం అన్నారు. గుమ్మకోట పంచాయితీ గుజ్జిలి గ్రామంలో కొత్త అంగన్‌వాడీ భవనాన్ని, ఐసిడిఎస్ సిడిపిఓ సుగుణ, మాజీ ఎంపీపీ నీలవేణి, సర్పంచ్ పాగి అప్పారావు మండల అధ్యక్షుడు సూర్యనారాయణ, వ్యాపారవేత ఎం ఆర్ చౌదరి ప్రారంభించారు. ఎమ్మెల్యే రేగం మాట్లాడుతూ బాల్య సంరక్షణ కేంద్రంగా పనిచేయడంతో పాటు, ఈ కేంద్రం ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు మరియు మాతాశిశు సంక్షేమాన్ని మెరుగుపరచడానికి చొరవలను కూడా నిర్వహిస్తుందని. అంగన్వాడి కేంద్రం తమ సమాజంలో జీవన నాణ్యతను పెంచడంలో ఒక ముందడుగు అని గ్రామస్తులు గుర్తించాలని కోరారు. అనంతరం అంగన్వాడి కేంద్ర నిర్మాణానికి తనవంతుగా సహాయం అందించిన వ్యాపారవేత చౌదరిని దుస్సాలులతో సన్మానించారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

అరకు ఎమ్మెల్యే రేగం.

గుమ్మకోట పంచాయితీ దబ్బలపాడు గ్రామంలో క్రీడా పోటీలను రిబ్బన్ కట్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శరీర దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని, క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ గెలుపు ఓటములను పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడల్లో ముందుకు సాగాలంటే సాధననే ముఖ్యమని తెలిపారు. గిరిజన యువత విద్యతో పాటు క్రీడలలో రాణించాలని అత్యున్నస్థాయి ఎదగాలని మద్యం, గంజాయి వంటి వ్యసనాలకు లోను కాకుండా విద్య క్రీడలపై అత్యున్నత స్థాయికి చేరుకోవాలని కొరారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు అశోక్,తవిటి నాయుడు, ఎస్టీ కమిటీ అధ్యక్షులు బూరుగు గంగన్న దొర, గ్రామ కమిటీ అధ్యక్షులు పెంటయ్య, మండల కార్యవర్గ సభ్యులు పోయి రామకృష్ణ, వార్డు సభ్యులు ఎం కృష్ణ, బి శంకర్రావు, పోయి లక్ష్మి, క్రీడాకారులు వైసిపి కార్యకర్తలు పార్టీ శ్రేణులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## రోడ్డు దిగ్బంధంతో దిగొచ్చిన అధికారులు...!



**సిపిఐ, నేతల పోరాటంతో ఎం మాకవరం రోడ్డుకు మోక్షం**



**కొయ్యూరు, పెన్ పవర్ ఫిబ్రవరి 2 :** గత ఎనిమిది రోజులుగా నడింపాలెం -ఎం మాకవరం వరకు సిసి రోడ్డు నిర్మించాలని సిపిఐ నేతలనిరసన దీక్ష 9వ రోజు అధికారులు హామీ ఇవ్వడంతో నిరసన దీక్షలు విరమించారు. వైసిపి మండల అధ్యక్షులు బడుగు రమేష్ బాబు సిపిఐ దీక్ష శిబిరానికి వచ్చి మద్దతు తెలపడంతో వెంటనే కార్యచరణలో భాగంగా రోడ్డును నిర్మించడానికి అధికారులు హామీ ఇవ్వకపోవడంతో జాతీయ రహదారిని దిగ్బంధం చేశారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు హామీ ఇవ్వడంతో రహదారి ముట్టడిని విరమించుకున్నారు. కాగా రెండు గంటల పైగా రహదారిని దిగ్బంధించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడడంతో రాకపోకలు నర్సీపట్నం, ఏలేశ్వరం వైపునిలిచిపోవడంతో పోలీసులు హుటాహుటిన నడింపాలెం చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం మంప ఎస్సై సిదరి శ్రీనివాస్ వైసీపీ ఎంపీపీ బడుగు రమేష్ బాబు, సిపిఐ నేతలతో గ్రామస్తులతో మాట్లాడి నిరసన దీక్షను విరమింపజేశారు. ఈ నిరసన దీక్షలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలేపల్లి వెంకటరమణ, జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, మండల కార్యదర్శి ఇరువాడ దేవుడు, సహాయ కార్యదర్శి ఉల్లి సూరిబాబు, రైతు సంఘం జిల్లా నేత కనకరాజు, వైసిపి సర్పంచులు నత్తూరు సోమన్న దొర, జంపా రాజకుమారి, చిన్న తల్లి, ఎంపీటీసీ పొడుగురత్నం , సిపిఐ నేతలు నానాజీ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పల్లా కి వినతి పత్రాన్ని అందజేసిన పాత కర్ణవానిపాలెం గ్రామస్తులు



**గాజువాక :పెన్ పవర్ ,ఫిబ్రవరి 02** జివియంసి 72,76వ వార్డు లో గల పాతకర్ణవాని పాలెం గ్రామస్తులు గాజువాక శాసనసభ్య పల్లా శ్రీనివాసరావుని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ పాత కర్ణవానిపాలెం ప్రధాన రహదారిలో ఎన్నో ఏళ్లుగా షాపులు పెట్టుకొని వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నామని అన్నారు, ఇలా ఉండగా గాజువాక జగ్గు జంక్షన్ నుండి వై జంక్షన్ వరకు రోడ్ల వెడల్పు చేయుటకు పనులు ప్రారంభించిన జీవీఎంసీ అధికారులు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా తమ షాపులను, కొంతమంది గృహాలను కొట్టే పనులు ప్రారంభించారని అన్నారు, గతంలో కూడా గంగవరం పోర్టు కోసం రోడ్డు వేసినప్పుడు ప్రతి ఒక్కరు కొంత స్థలం నష్టపోయామని తెలిపారు. ఇప్పుడు రోడ్డుకి అనుకొని ఉన్న శాశ్వత కట్టడాలు స్థలాలు మార్కింగ్ చేసిన అంతవరకు రోడ్డు విస్తరణ జరిగినట్లయితే తాము పూర్తిగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగేలా ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుని కోరారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఈ సమస్యపై సానుకూలంగా స్పందించి సదరు అధికారులతో మాట్లాడి బాధితులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.ం

## వార్డులో ఫుట్ పాత్ పనులకు భూమి పూజ చేస్తున్న రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాధం



**కూర్మానపాలెం :పెన్ పవర్ ,ఫిబ్రవరి 02 :** గాజువాక నియోజకవర్గం 87వ వార్డ్ పరిధిలో హైవే నుండి గాంధి బొమ్మ మీదగా ఆటోనగర్ సెంటర్ వరకు ఇరువైపల ఫుట్ పాత్ పనులకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి స్థానిక వార్డ్ కార్పొరేటర్ బోండా జగన్నాధం జగన్ పాల్గొన్నారు. నేషనల్ హైవే నుండి గాంధీ బొమ్మ జంక్షన్ వరకు ఇరువైపులా ఫుట్ పాత్ పనులు చేయుట కొరకు జీవీఎంసీ నిధులు సుమారు మూడు కోట్ల రూపాయలు మంజూరు చేయించుకున్నామని. వాటిలో భాగంగా వడ్లపూడి నుండి పనులు ప్రారంభమయ్యాయని, పనులు పట్ల నాణ్యత తగ్గకుండా చేయాలని సంబంధిత కాంట్రాక్టర్ కు సూచించడం జరిగిందని బొండా జగన్ అన్నారు . కార్యక్రమంలో సెక్రెటరీ బొట్టా ప్రకాష్ రాజన్ రాజు, కళ్లేపల్లి శ్రీనివాసవర్మ, గండేపల్లి రాము, ఈర్ల దేముడు,రాజు, బోండా నాగరాజు, వర్క్ ఇన్స్పెక్టర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దిపాలెంలో పోతిన వెంకట అప్పారావుకు సత్కారం.





**ఆనందపురం, పెన్ పవర్ ఫిబ్రవరి 02:** ఆంధ్రప్రదేశ్ జేఏసీ విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన పోతిన వెంకట అప్పారావును స్థానికులు మర్యాదపూర్వకంగా సత్కరించారు. ఈ సందర్భంగా బీఎస్పీ పార్టీ సభ్యుడు లావేటి జగన్నాథరావు, అభినవ ఆంధ్ర రిపోర్టర్ నవీన్, ఓ ఎస్ జి ఫౌండేషన్ శివ దళాయి కలిసి సాలువా కప్పి, పూలమాల వేసి, పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

గ్రామాభివృద్ధి, ఉద్యోగుల సంఘం కోసం అప్పారావు చేస్తున్న సేవలను వారు ప్రశంసించారు. కొత్త బాధ్యతల్లో మరింత విజయాలు సాధించి ముందుకు సాగాలని ఆకాంక్షించారు. స్నేహపూర్వక వాతావరణంలో జరిగిన ఈ సత్కార కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు

# ట్రాఫిక్ నిబంధనలు పాటించండి -- ఆనందపురంలో ఓ ఎస్ జి ఫౌండేషన్ అవగాహన ర్యాలీ







**ఆనందపురం, పెన్ పవర్ ఫిబ్రవరి 02:** సమాజంలో ప్రతి ఒక్కరి ప్రాణం అమూల్యమని, రహదారి ప్రమాదాలను తగ్గించాలంటే ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఓ ఎస్ జి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శివ దళాయి పిలుపునిచ్చారు. విద్యార్థి దశ నుంచే రహదారి భద్రతపై అవగాహన పెంపొందించడం అవసరమని, ఇందుకు స్వచ్ఛంధ సంస్థలు ముందుకు రావాలని సూచించారు.

సోమవారం ఉదయం ఆనందపురం జంక్షన్ వద్ద ఓ ఎస్ జి ఫౌండేషన్ మరియు ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రహదారి భద్రత అవగాహన ర్యాలీ నిర్వహించారు. పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించాలంటే వాహనదారులు హెల్మెట్, సీటుబెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, త్రిబుల్ రైడింగ్ చేయకూడదని, మొబైల్ మాట్లాడుతూ వాహనం నడపడం ప్రమాదకరమని, ట్రాఫిక్ సిగ్నల్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, మితిమీరిన వేగాన్ని నియంత్రించాలని సూచించారు.

లా అండ్ ఆర్డర్ ఎస్ ఐ శివ, ట్రాఫిక్ ఎస్ ఐ పాపారావు మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, ఏదైనా ప్రమాదం జరిగితే తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. విద్యార్థుల్లో రహదారి భద్రతపై చైతన్యం కల్పించేందుకు ఓ ఎస్ జి ఫౌండేషన్, గ్రామీణ వైద్యుల సంఘం చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని, భవిష్యత్తులో కూడా పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పితల గోవింద్, చల్ల రామిరెడ్డి, యారంశెట్టి సంతోష్, పైడిరాజు, ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి, గౌరవ అధ్యక్షులు తిరుపతి రావు జోనల్ అద్వైజర్ మరియు కారుణ్య క్యాన్సర్ ఫౌండేషన్ సెక్రటరీ కోన. ప్రకాశ్ ప్రధాన కార్యదర్శి గెద్ద చిరంజీవి, సహాయ కార్యదర్శి కె. నారాయణరావు, వినోద్, పి. సుధాకరరెడ్డి, రఘు, శ్రీనివాస్, శ్రీ వెంటేశ్వర స్కూల్ ప్రిన్సిపాల్ వంశీ, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీ అనంతరం ప్లకార్డులు ప్రదర్శిస్తూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ ప్రాణాలను కాపాడుకుంటామని అందరూ ప్రతిజ్ఞ చేశారు.



# దేశాన్ని ఆత్మనిర్భర్ వైపు నడిపించే బడ్జెట్

- అల్లూరి జిల్లాలో పర్యాటకాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయింపుపై హర్షం



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 2:** దేశాన్ని ఆత్మనిర్భర్ భారత్ దిశగా ముందుకు నడిపించే దూరదృష్టి గల బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారని భారతీయ జనతా పార్టీ గూడెం కొత్తవీధి మండల అధ్యక్షుడు కాకూరు శేఖర్ పేర్కొన్నారు. స్వదేశీ స్వావలంబన, వికసిత భారత్ లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ చేపడుతున్న కార్యక్రమాలకు సంపూర్ణ సహకారం అందించేలా ఈ బడ్జెట్ రూపొందించారని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ బడ్జెట్ ముఖ్యంగా పర్యాటక రంగానికి ఎంతో ఊతమిచ్చేదిగా ఉందన్నారు. అరకలోయలో పర్యావరణహిత పర్యాటకాభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించడం హర్షణీయమని పేర్కొన్నారు. దీనివల్ల అల్లూరి సీతారామరాజు జిల్లాలో పర్యాటక రంగం మరింత అభివృద్ధి చెంది, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.హైస్పీడ్ రైలు కారిడార్లతో దక్షిణ భారతానికి మెరుగైన కనెక్టివిటీ, జలమార్గాలు, లాజిస్టిక్స్ అభివృద్ధికి ఈ బడ్జెట్‌లో అత్యధిక నిధులు కేటాయించారని తెలిపారు. నగర ఆర్థిక ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తన మద్దతును ఈ బడ్జెట్ ద్వారా స్పష్టంగా తెలిపిందన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర పన్నుల వాటాగా రూ.64,362.16 కోట్లను ఈ బడ్జెట్‌లో కేటాయించారని చెప్పారు. రాష్ట్రంలోని పర్యాటక, ప్రకృతి వారసత్వ సంపదను పరిరక్షించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించడం విశేషమన్నారు. ముఖ్యంగా ప్రకృతి రమణీయ ప్రదేశాలతో నిండిన అల్లూరి జిల్లాలో టూరిజం అభివృద్ధికి ఈ బడ్జెట్ సరికొత్త ఊతమిచ్చిందన్నారు.నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ ఏర్పాటుకు, దేశవ్యాప్తంగా 20 పర్యాటక ప్రాంతాల్లో 10 వేల మంది గైడ్లకు నైపుణ్య శిక్షణ అందించేందుకు నిధులు కేటాయించారని తెలిపారు. అన్ని పర్యాటక ప్రదేశాల్లో డిజిటల్ డాక్యుమెంటేషన్ ఉండేలా చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. ట్రెక్కింగ్ మార్గాలు, పర్వత ప్రాంతాల అభివృద్ధి, తీరప్రాంతాల్లో పక్షుల వీక్షణ కోసం ప్రత్యేక మార్గాలు, 15 పురావస్తు ప్రదేశాల ఆధునీకరణ వంటి అంశాలు ఈ బడ్జెట్‌లో ప్రత్యేకంగా పొందుపరిచినట్లు చెప్పారు.స్టెమ్ విద్యను అభ్యసించే బాలికల కోసం జిల్లాకు ఒక హాస్టల్ మంజూరు చేయనున్నట్లు, మహిళలు, దివ్యాంగుల సామాజిక సంక్షేమం, ఉపాధి అవకాశాలు, మానసిక ఆరోగ్యం కోసం ప్రత్యేక నిధులు కేటాయించడం శుభపరిణామమని కాకూరు శేఖర్ పేర్కొన్నారు.

# విశాఖ తీరంలో అంతర్జాతీయ నౌకాదళ సమీక్ష, మిలాన్ 2026



**ఘనంగా ఫిబ్రవరి 18, 19 తేదీల్లో నిర్వహణ**

**పెన్ పవర్ ఫిబ్రవరి 2:** విశాఖపట్నం వేదికగా ఫిబ్రవరి 18న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ , 19న మిలాన్--2026 కార్య క్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు అధికా రులు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ఏపీ సచివాలయంలో తూర్పు నౌకాదళ కమాం డ్ చీఫ్ వైస్ అడ్మిరల్ సుశీల్ మెన్నన్ తదితర నౌకాదళ ఉన్నతాధికారులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్‌ను కలసి ఏర్పాట్లపై చ ర్చించారు.ఈ సందర్భంగా వైస్ అడ్మిరల్ సుశీల్ మెన్నన్ మాట్లాడుతూ, ఈ అంతర్జాతీయ నౌకా దళ సమీక్షకు ప్రపంచంలోని 19 దేశాల నుంచి నౌకలు, విమానాలు, ప్రతినిధులు హాజరుకాను న్నారని తెలిపారు. శ్రీలంక, ఇరాన్ తదితర దేశాలతో పాటు సుమారు 4,000 మంది విదేశీ ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్ దేశాల నుంచి మూడు నౌకలు, సుమారు 150 మంది ప్రతినిధులు రానున్నార ని వెల్లడించారు. భారత్ తరఫున 90 నౌకలు, 45 విమానాలు, దాదాపు 600 మంది ప్రతినిధు లు పాల్గొంటారని తెలిపారు.ఫిబ్రవరి 18, 19 తేదీల్లో విశాఖపట్నం తీరప్రాంతంలో ఈ కార్య క్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమం త్రి నారా చంద్రబాబు నాయుడు హాజరవుతార ని, మిలాన్--2026కు కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పాల్గొంటారని తెలిపారు. అలాగే అం తర్జాతీయ సిటీ పరేడ్‌కు ముఖ్యమంత్రి సహా ఇతర ప్రముఖులు హాజరవుతారని వివరించా రు.ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి కె. విజ యానంద్ మాట్లాడుతూ, విశాఖపట్నంలో జరిగే ఐ.ఎఫ్.ఆర్ మిలాన్--2026 కార్యక్రమాలు విజ యవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభు త్వం అన్ని విధాల సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. సంబంధిత శాఖల అధికా రులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదే శాలు జారీ చేశారు. రాష్ట్రపతి, రక్షణ మంత్రి, గవర్నర్, ముఖ్యమంత్రి వంటి వీవీఐపీలు హాజరవుతున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను మరింత కట్టుదిట్టంగా చేపట్టాలని సూచించారు.

ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ అంటే?

రాష్ట్రపతి తన పదవీకాలంలో ఒకసారి భారత నౌకాదళ సామర్థ్యాలను సమీక్షించే కార్యక్రమమే ప్రెసిడెంట్ ఫ్లీట్ రివ్యూ. దీనిలో భాగంగా అంతర్జాతీయ నౌకాదళ సమీక్షలో పొరుగుదేశాల నౌక లు కూడా పాల్గొని తమ సామర్థ్యాలను ప్రదర్శి స్తాయి. ముఖ్యమైన యుద్ధ నౌకలు, సబ్‌మెరిన్లు ఇందులో పాల్గొంటాయి.

మిలాన్ అంటే?

వివిధ దేశాల నౌకాదళాలు పరస్పర సహకారం, సముద్ర భద్రతా సామర్థ్యాల పెంపు లక్ష్యంగా నిర్వహించే అంతర్జాతీయ కార్యక్రమమే మిలాన్. ఈ సందర్భంగా ఆయా దేశాల సాంస్కృతిక ప్రదర్శనలు కూడా నిర్వహిస్తారు.

ఈ సమావేశంలో జీఏడీ ప్రధాన కార్యదర్శి జె. శ్యామలారావు, ప్రోటోకాల్ అదనపు డైరెక్టర్ మోహన్‌రావు పాల్గొన్నారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఐజీ ఆపరేషన్స్ సీహెచ్ శ్రీకాంత్ తదితరులు వర్చువల్‌గా హాజరయ్యారు.

# తిరుమల లడ్డూ పేరుతో విద్వేష రాజకీయాలు







**ప్రజల దృష్టి మళ్లించేందుకే వరుస దాడులు: వైయస్సార్సీపీ**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఫిబ్రవరి 02 :** కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా తిరుమల లడ్డూ ప్రసాదంపై తప్పుడు ప్రచారం చేస్తూ విశాఖలో అర్ధరాత్రి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడాన్ని వైయ స్సార్సీపీ తీవ్రంగా ఖండించింది. మత విద్వేషా లను రెచ్చగొట్టేలా సాగుతున్న ఈ కుట్రపై విశాఖ జిల్లా వైయస్సార్సీపీ అధ్యక్షుడు కెకె రాజు ఆధ్వ ర్యంలో పార్టీ నాయకులు 4వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.స్టేషన్ బయట మీడియాతో మాట్లాడిన నాయకులు, ఫ్లెక్సీలను తక్ష ణమే తొలగించి వాటి వెనుక ఉన్న వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశా రు. తిరుమల లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు కలిసిందన్న ఆరోపణలకు ఎలాంటి ఆధా రాలు లేవని, సీబీఐ సిట్ చార్జిషీట్‌లోనూ అలాం టిదేమీ లేదని స్పష్టమైందని తెలిపారు. అయిన ప్పటికీ రాజకీయ లబ్ధి కోసం కోట్లాది భక్తుల వి శ్వాసాలతో చెలగాటం ఆడుతున్నారని మండిప డ్డారు.విశాఖలో రూ.5 వేల కోట్ల విలువైన ప్రభు త్వ భూములను చంద్రబాబు కుటుంబ సభ్యు లకు చెందిన గీతంకి కట్టబెట్టిన వ్యవహారంపై వైయస్సార్సీపీ ఉద్యమిస్తుండటంతో ప్రజల దృష్టి మళ్లించేందుకే ఈ విధమైన ఫ్లెక్సీలు, దాడులు, కేసుల రాజకీయాలు సాగుతున్నాయ ని ఆరోపించారు. లడ్డూ అంశంపై నిజాలు వెలు గులోకి రావడంతో కూటమి నాయకులు తట్టుకో లేక వైయస్సార్సీపీ నాయకులపై వరుస దాడు లు చేయిస్తున్నారని చెప్పారు.

చంద్రబాబు పాలనలో భయోత్పా తం కెకె రాజు,విశాఖ జిల్లా వైయస్సార్సీపీ అధ్యక్షుడు సిట్ చార్జిషీట్ ద్వారా లడ్డూలో జంతువుల కొవ్వు కలవలేదని తేటతెల్లమైం దని, అయినా చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ తదితరులు చేసిన ఆరోపణలపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని కెకె రాజు తెలిపారు. దాన్నుంచి ప్రజల దృష్టి మళ్లించేం దుకు లడ్డూలో కల్తీ లేదని చెప్పిన వారి ఇళ్లపై దాడులు చేయించి, బాధితులనే అరెస్టు చేయి స్తున్నారని విమర్శించారు. భూమన కరుణాకర రెడ్డి, విడదల రజని, బొల్లా బ్రహ్మనాయుడు, అంబటి రాంబాబు తదితరులపై ప్రణాళికబ ద్ధంగా దాడులు జరిగాయని ఆరోపించారు.

ప్రశ్నించే గొంతులను నొక్కేందుకు దాడులు, కేసులతో భయ వాతావరణం సృష్టిస్తున్నారని, ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబే శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా వ్యవహ రిస్తున్నారని అన్నారు. తిరుమల లడ్డూ విష యంలో తప్పుడు ప్రచారం చేసిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్‌లు శ్రీవారి భక్తులకు క్షమా పణ చెప్పాలని డిమాండ్ చేశారు. అర్ధరాత్రి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను వెంటనే తొలగించా లని, మత విద్వేషాలను రెచ్చగొట్టే కూటమి నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవా ల ని కోరారు. సనాతన ధర్మం పేరుతో మాట్లాడే బీజేపీ నాయకులు ఈ విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు.రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలి

వరుదు కళ్యాణి, ఎమ్మెల్సీరాష్ట్రంలో కూటమి నాయకులు సృష్టిస్తున్న విధ్వంసాన్ని చూస్తుంటే ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నామా లేక అఫ్ఘానిస్తాన్‌లో ఉన్నామా అన్న సందేహం కలుగుతోందని ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి వ్యాఖ్యానించారు. వైయస్సార్సీపీ నాయకుల ఇళ్లపై పెట్రోల్ బాంబులతో దాడులు జరుగుతుంటే పోలీసులు చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబటి రాంబాబు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నప్పటికీ ఆయన ఇంటిపై దాడి జరగ డం ప్రణాళికాబద్ధమైన కుట్రేనని ఆరోపించా రు.గీతంకి భూదోపిడీపై ప్రశ్నిస్తే ప్రభుత్వం సమాధానం చెప్పలేక దాడులకు పాల్పడుతోం దని, అధికార పార్టీ నాయకులే విద్వేషాలు రెచ్చగొట్టి శాంతిభద్రతల సమస్య సృష్టిస్తున్నా రని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో గవర్నర్ జోక్యం చేసుకుని రాష్ట్రంలో రాష్ట్రపతి పాల నకు సిఫార్సు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సమన్వయకర్త తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి, మొల్లి అప్పారావు, డిప్యూటీ మేయర్ కట్టామురి సతీష్, ఎస్ఈసీ సభ్యులు రొంగాలి జగన్నాథం, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్ రాజు, జివి రవి రాజు, మాజీ చైర్మన్లు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యదర్శి కి సన్మానించిన గ్రామస్తులు



**కొయ్యూరు, పెన్ పవర్ ఫిబ్రవరి 2:** మంప పంచాయితీ కార్యదర్శి రవి సేవలు మరవలేనివని మంప మాజీ ఎంపీటీసీ బి. శివరామరాజు అన్నారు. సోమవారం ఈ సందర్భంగా ఆయన ను పూలమాలలు వేసి దుఃసాలువతో గ్రామస్తులు సత్కరించారు. ఈ సందర్భంగా శివరామరాజు మాట్లాడుతూ... గ్రామస్తులతో పంచాయతీ కార్యదర్శి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. ఉద్యోగరీత్యా పంచాయతీ కార్యదర్శి గా ఉంటూ గ్రూప్ 2 అధికారిగా అమరావతి బదిలీ అవ్వడం ఒకరకంగా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజబాబు, పీసా కమిటీ కార్యదర్శి ఏ.సత్తిబాబు, కోసూరి రాంబాబు, భాస్కర రావు, వీఆర్వో మరియమ్మ, సచివాలయ సిబ్బంది గ్రామస్తులు పాల్గొని రవిని సన్మానించారు.

# కరాటే పోటీల్లో బ్లూమింగ్ స్టార్ బాలికల సత్తా...

## పలు పతకాలతో మెరిసిన చిన్నారులు






**రేఖవానిపాలెం, పెన్ పవర్ ఫిబ్రవరి 02 :** విద్యతో పాటు క్రీడలు కూడా పిల్లల శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి ఎంతో అవసరమని బ్లూమింగ్ స్టార్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల డైరెక్టర్ సుకుమార్ పాణిగ్రాహి తెలిపారు. విశాఖ జిల్లా భీమునిపట్నం మండలం రేఖవానిపాలెంలో ఉన్న పాఠశాల విద్యార్థినులు అంతర్జాతీయ కరాటే, స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించడంతో సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.

స్వర్ణ భారతి స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగిన తొమ్మిదవ అంతర్జాతీయ కరాటే పోటీల్లో డిసెంబర్ 30, 31, జనవరి 1 తేదీల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మూడేళ్ల నుంచి ఏడేళ్ల వయసున్న ఆరుగురు బాలికలు కరాటే, స్కేటింగ్ విభాగాల్లో పాల్గొన్నారు.

వీరిలో ఆరేళ్ల కె బ్లెస్సి కాటా విభాగంలో బంగారు పతకం, కుమితే విభాగంలో వెండి పతకం సాధించి ప్రత్యేక గుర్తింపు పొందింది. అలాగే ఎం సాధ్య, టి హన్విక, జి గహనవి, జి హన్విత కూడా పతకాలు సాధించారు. స్కేటింగ్ విభాగంలో యూకేజీ చదువుతున్న ఎం సంయుక్త జిల్లా స్థాయిలో పతకం గెలిచి పాఠశాలకు పేరు తెచ్చింది.

ఈ సందర్భంగా డైరెక్టర్ సుకుమార్ పాణిగ్రాహి, ప్రిన్సిపల్ రాజరాజేశ్వరి విజేతలతో పాటు శిక్షకులు మాస్టర్ రెమో యాదవ్, కోచ్ రాంబాబు, నిఖిల్‌లను అభినందించారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులను జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలకు తీసుకెళ్లేందుకు క్రీడలపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని తెలిపారు.

## డాక్టర్ గంగులయ్యపై అసత్య ఆరోపణలు సహించం

* జనసేన శ్రేణుల హెచ్చరిక



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 2:**అల్లూరి సీతారామరాజు జిల్లా జనసేన పార్టీ పాడేరు నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ వంపూరు గంగులయ్యపై కొందరు వ్యక్తులు చేస్తున్న అసత్య ఆరోపణలను గూడెం కొత్తవీధి మండలం దారకొండ, దుప్పులవాడ, గుమ్మిరేవుల పంచాయతీల జనసేన నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా ఖండించారు. సోమవారం దారకొండలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పదవుల కోసం పాకులాడే కొందరు కావాలనే డాక్టర్ గంగులయ్యపై బురద జల్లుతున్నారని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతంలో జనసేన జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ఉద్యమమే ఊపిరిగా పనిచేస్తున్న నాయకుడిని టార్గెట్ చేయడం శోచనీయమన్నారు. వ్యక్తిగత విమర్శలు మానుకోకపోతే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. పార్టీని బలహీనపరిచేందుకు జరుగుతున్న కుట్రలను కార్యకర్తలు నమ్మవద్దని సూచించారు. అందరం ఒకే కుటుంబంలా ఐక్యంగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే మన లక్ష్యమని, క్రమశిక్షణతో పార్టీని మరింత బలోపేతం చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బురిడి సరస్వతిరావు, పుచ్చకాయల బాబురావు, డి. దార ఈశ్వరరావు, పి. దాసుబాబు, నైని బోధరాజు, కె. టొక్కుబాబు, కిల్లో మల్లు, గంపరాయి కొండబాబు, గురుమూర్తి, బత్తుల జయకుమార్, భగత్‌రామ్, కొర్ర ముకుంద్, వాసు, కె. రుకుదర్ తదితర జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెండేళ్లుగా మంజూరుకు నోచుకొని కొత్త పెన్షన్లు, రేషన్ కార్డులు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 2:** జిల్లాలో అర్హులైన నిరుపేదలకు కొత్త పెన్షన్లు. కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిసిసి కార్యదర్శి కారే శ్రీనువాసు కోరారు. సోమవారం ఆయన స్థానిక పత్రిక విలేకరులతో మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా కొత్త పెన్షన్ లు కోసం కొత్త రేషన్ కార్డులు కోసం అభ్యర్థులు సచివాలయల చుట్టూ తిరుగుతున్నప్పటికీ ప్రభుత్వ అధికారులు కొత్త రేషన్ కార్డులు కొత్త పెన్షన్లు మంజూరు చేయలేదని అన్నారు దీనివల్ల వృద్ధులు వికలాంగులు కొత్తగా వివాహం చేసుకున్న వారు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు అని అన్నారు ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు పేద ప్రజలకు మేలు జరిగే విధంగా అర్హులైన పెన్షన్ దారులకు పెన్షన్లు అర్హులైన రేషన్ కార్డుదారులకు రేషన్ కార్డులు మంజూరు చేసి పేద ప్రజలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని ప్రభుత్వ పెద్దలను కోరారు.

## వికసిత్ భారత్ పేరుతో మైనింగ్ అనుమతి సరికాదు.

* ఆదివాసీ వ్యతిరేక బడ్జెట్- ఆదివాసీ గిరిజన సంఘం




**అరకులోయ పెన్ పవర్ 2**:కేంద్ర ప్రభుత్వం 2026-27 సంవత్సర బడ్జెట్ లో 53 లక్షల కోట్లు పైగా కేటాయింపులో ఆదివాసులకు 8.8 శాతం జనాభ ప్రాతిపదికన 6 లక్షల కోట్లకు పైగా నిధులు కేటాయించాల్సి ఉండగా

కేవలం 1 లక్ష 41 వేలకోట్లు రుపాయిలు మాత్రమే కేటాయించారని అదికూడ వివిధ శాఖలకు(టీఎస్పీ )కింద కేటాయించారు తప్ప నేరుగా( మినిస్టర్ ఆఫ్ ట్రైబల్ అఫైర్స్ కు) కేటాయించింది కేవలం 15,421 కోట్లు రూపాయలు మాత్రమే గత ఏడాది కన్నా స్వల్ప కేటాయింపులు పెంచినట్లు కనిపించిన కేటాయించిన నిధులుకూడ పూర్తి స్థాయిలో ఖర్చు జరగడంలేదని కేటాయించిన నిధులకూడ దారిమల్లిస్తున్నారని ఆదివాసీ జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని ఆదివాసీ గిరిజన సంఘం అల్లూరి జిల్లా కమిటీ డిమాండ్ చేశారు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ అధ్యక్షులు ఎస్ ధర్మన్నపడాల్ మాట్లాడుతూ పార్లమెంట్ లో కేంద్ర బడ్జెట్ కేటాయింపులో ఆదివాసులకు తీవ్ర అన్యాయం జరిగిందని అంకెల గారడీ చేసి ఆదివాసీ ప్రాంతాల్లో మైనింగ్, టూరిజం పేరుతో ఆదివాసీ హక్కులు చట్టాలు ఉల్లంఘించి బడా కార్పొరేట్ సంస్థలకు కట్టనెడుతున్నారని (పివిటిజి)లకు పీఎం జన్మన్ యోజనకు 24 వేల కోట్లు రూపాయలు కేటాయింపులు చేసినట్లు చెప్పిన నిధులు లేక

నిర్మాణంలో ఉన్న వేలాది ఇళ్ళలకు నిధులు లేక మధ్యలో నిలిచిపోయిందని జన్ మాన్ యోజన ఇల్లు యూనిట్ ఖరీదు

2,లక్షల 39 వేల రూపాయలు ఇల్లనిర్మాణనికి నిధులు సరిపోవడం లేదని బడ్జెట్ కేటాయింపులో పీఎం జన్మన్ ఇల్లు నిర్మాణానికి యూనిట్ ఖరీదు 10 లక్షలు రూపాయలు నిధులు పెంచాలని డిమాండ్ చేశారు

గిరిజన యూనివర్సిటీ నిర్మాణానికి 800 కోట్లు రూపాయలు నిధులు అవసరం ఉండగా కేటాయింపులో స్పష్టత లేదని తాత్కాలిక భవనంలో యూనివర్సిటీ నడుస్తున్న పరిస్తితి నిధులులేనందున నిర్మాణాలు మద్యలో నిలిచిపోయినది తక్షణమే నిధులు కేటాయించి యూనివర్సిటీ నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు

ఏకలవ్య పాఠశాల వసతిగృహాలకు అభివృద్ధికి బడ్జెట్ కేటాయింపులు పెంచినట్టు తెలిపిన నిధులులేక నిర్మాణంలో ఉన్న భవనాలు మద్యలో నిలిచిపోయిందని ఎస్సీ ఎస్టీ బ్యాగ్ లాగ్ పోస్టుల భర్తీ పై బడ్జెట్ కేటాయింపులో ఎటువంటి ప్రస్తావన లేదని ఏజెన్సీ ప్రాంతాల్లో టూరిజం,మైనింగ్ కోసం ఘనంగా ప్రాధాన్యత ఉందని ప్రకటన వెనకల ఏజెన్సీలో అపారమైన సహజవనరులు,అడవులు,భూములు కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైందని ఆదివాసీలకు జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని గిరిజన సంక్షేమశాఖకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# బంగ్లాదేశ్ చెర నుంచి విజయనగరం జిల్లా మత్స్యకారులకు విముక్తి






* మూడు నెలల ఉత్కంఠకు ముగింపు
* విశాఖ చేరుకున్న తొమ్మిది మంది మత్స్యకారులు
* కేంద్రంతో నిరంతర సమన్వయం తో విడుదల సాధించిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**విశాఖ దక్షిణం పెన్ పవర్, ఫిబ్రవరి 02 :**బంగ్లాదేశ్ నౌకాదళం చెరలో చిక్కుకున్న విజయ నగరం జిల్లా చెందిన తొమ్మిది మంది మత్స్య కారులు చివరకు స్వదేశానికి చేరుకున్నారు. రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజ రాపు అచ్చెన్నాయుడు చేపట్టిన ప్రత్యేక చొరవ, కేంద్ర ప్రభుత్వంతో సాగించిన నిరంతర దౌత్య ప్రయత్నాల ఫలితంగా సోమవారం ఉదయం మత్స్యకారులు క్షేమంగా విశాఖ తీరానికి చేరుకున్నారు.మూడు నెలలుగా కొనసాగిన అనిశ్చితి, ఆందోళనలకు ముగింపు పలకడంతో మత్స్యకారుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరి సింది. విశాఖకు చేరుకున్న మత్స్యకారులకు అధికారులు ఘన స్వాగతం పలికారు. అనం తరం నిత్యావసర సరుకులు అందజేసి, భద్ర తతో వారి స్వస్థలాలకు తరలించారు.గత అక్టోబర్‌లో మత్స్యకారులు పొరపాటున అంత ర్జాతీయ సముద్ర సరిహద్దు దాటడంతో బంగ్లా దేశ్ అధికారుల అదుపులోకి వెళ్లారు. ఈ విష యం వెలుగులోకి రాగానే మంత్రి అచ్చెన్నాయు డు వెంటనే స్పందించి, వ్యక్తిగతంగా వ్యవహారా న్ని పర్యవేక్షించారు. మత్స్యకారుల పడవ రిజిస్ట్రేషన్ వివరాలు, చిరునామాలు సేకరించి కేంద్ర విదేశాంగ శాఖకు నివేదించారు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మో హన్ నాయుడుతో సమన్వయం చేసుకుంటూ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా దృష్టికి సమస్యను తీసుకెళ్లడంలో మంత్రి అచ్చెన్నాయుడు కీలక పాత్ర పోషించారు. భారత కోస్ట్ గార్డ్, బంగ్లాదేశ్ అధికారులతో మత్స్యశాఖ ఉన్నతాధికారులు నిరంతరం సంప్రదింపులు జరిపి, విడుదల ప్రక్రి యలో ఎదురైన సాంకేతిక అడ్డంకులను తొలగిం చారు.బంగ్లాదేశ్ నుంచి విడుదలైన అనంతరం మత్స్యకారులు సోమవారం ఉదయం విశాఖ చేరుకున్నారు. తమను సురక్షితంగా స్వదేశానికి రప్పించడంలో అహర్నిశలు కృషి చేసిన మంత్రి అచ్చెన్నాయుడికి మత్స్యకారులు, వారి కుటుం బ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

"మా అచ్చెన్నాయుడు మాకు పెద్ద దిక్కు. ఆయన చొరవ వల్లే నాడు మా వారు సుర క్షితంగా మా ముందున్నారు" అంటూ మత్స్య కార మహిళలు భావోద్వేగానికి లోనయ్యారు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంఈ సందర్భంగా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ... మత్స్యకారుల క్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. అంతర్జాతీయ పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వ సహకారంతో మత్స్యకారులను సురక్షితంగా రప్పించగలిగామని తెలిపారు. ఆపదలో ఉన్న మత్స్యకారులకు అండగా నిలవడంలో ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని ఆయన భరోసా ఇచ్చారు.




## మన్యం జిల్లా కేంద్రంలో సికిల్ సెల్ నిర్ధారణ కేంద్రం ఏర్పాటు.

* న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సంస్థకు
* అభినందనీయం తెలిపిన
* టి.ఆర్.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు.లోవరాజు




**గుమ్మలక్ష్మీపురం జనవరి 02 పెన్ పవర్.**పార్వతిపురం మన్యం జిల్లా కేంద్రంలో చికెల్ సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయడం చాలా శుభ పరిణామం 37 లక్షల విలువ చేసే ఈ పరికరాలను కొవ్వాడ అను విద్యుత్ కేంద్రం మరియు శ్రీకాకుళం జిల్లా న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వారు ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేయడం పట్ల ఆ యొక్క సంస్థలకు ట్రైబల్ రైట్స్ ఫోరం( టిఆర్ఎఫ్)రాష్ట్ర అధ్యక్షులు రొబ్బా లోవరాజు సోమవారం నాడు పత్రిక విలేకరులతో ధన్యవాదాలు తెలియజేశారు.ఈ మేరకు లోవరాజు మాట్లాడుతూ.ప్రధానంగా పార్వతీపురం మన్యం జిల్లాలో సికిల్ సెల్ ఎనీమియా వ్యాధితో ఆదివాసులు ఎక్కువగా బాధపడుతున్నటువంటి పరిస్థితి ఉంది.సుమారుగా 34 మంది వ్యాధిగ్రస్తులు మరియు 4800 మంది వ్యాధికి దగ్గరగా ఉన్నట్లు ఇటీవల కాలంలోగుర్తించారు.ఇప్పటివరకు వీళ్లకు వ్యాధి నిర్ధారణ చేయడం కోసం రక్త నమోనాలు విశాఖపట్నం పంపించేవారు అక్కడ నుండి రిపోర్ట్స్ రావడం ఆలస్యం అవ్వడం వల్ల కొన్ని సందర్భాలలో చాలామంది ప్రాణాలు కూడా కోల్పోయే పరిస్థితి ఉండేదన్ని అన్నారు.ప్రస్తుతం మన్యం జిల్లా కేంద్రంలోని ఈ యొక్క నిర్ధారణ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసి దానికి తగిన పరికరాలను తీసుకువచ్చినందుకు అధికారులకి జిల్లా ప్రజా ప్రతినిధులు అందరికీ కూడా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాని. లావరాజ్ అన్నారు.

# కట్టిన సచివాలయ భవనానికి నిధులు ఇవ్వకుండానే...



**గ్రామపంచాయతీ నిధులతో మిగులు పనులు పూర్తి చేస్తున్నారు**

**సచివాలయ గుత్తేదారుడు తీవ్ర ఆవేదన**

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 2:**అల్లూరి జిల్లా గూడెం కొత్త వీధి మండలంలోని లకవరపుపేట గ్రామ సచివాలయ భవనాన్ని నిర్మిస్తున్న గుత్తేదారుడికి సమాచారం ఇవ్వకుండానే గ్రామపంచాయతీ నిధులతో మిగులు పనులను పూర్తి చేస్తుండడంతో గుత్తేదారుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో నిర్మిస్తున్న సచివాలయ భవనానికి సకాలంలో నిధులు మంజూరు కాకపోవడంతో అసంపూర్తిగా సచివాలయ భవనాన్ని ఉంచారు. నిధులు మంజూరు అయితే సచివాలయ భవనం పూర్తిస్థాయిలో నిర్మాణం జరిపి ఇవ్వడానికి గుత్తేదారుడు ఎదురుచూస్తున్న సమయంలో ఇటీవల గ్రామ పంచాయతీకి మంజూరైన నిధులతో సచివాలయ భవనాలు నిర్మించుకోవచ్చు అంటూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో లకవరపుపేట గ్రామపంచాయతీ కార్యదర్శి గతంలో భవనాన్ని నిర్మించిన గుత్తేదారుడు ఆంజనేయులు (అంజి)కి ఎటువంటి మందస్తు సమాచారాన్ని అందించకుండా భవన నిర్మాణ పనులను చేపడుతుండడంతో గుత్తేదారుడు ఆంజనేయులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ భవన నిర్మాణంలో తనకు ఇంకా పెండింగ్ బిల్లులు మంజూరు కావాల్సి ఉందని వాటిని మంజూరు చేయకుండానే ఇలా భవన నిర్మాణ పనులు గ్రామపంచాయతీ కార్యదర్శి చేపట్టడం భావ్యం కాదని ఈ విషయంపై అల్లూరి జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం జరుగుతుందని గుత్తేదారుడు ఆంజనేయులు తెలిపారు.జిల్లా ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకుని రావాల్సిన మిగులు బకాయిలు అందే విధంగా చూడాలని గుత్తేదారుడు కోరారు.

## గంజాయి నిర్మూలన, సైబర్ నేరాలపై అవగాహన..!

సీలేరు ఎస్ఐ ఎండి.యాసిన్





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 2**:అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలం దుప్పులవాడ పంచాయతీ పరిధి గొర్రెలోవ గ్రామంలో సీలేరు పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఎండి.యాసిన్ సోమవారం యువతకు గంజాయి వల్ల కలిగే దుష్పరిణామాలు, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎండి.యాసిన్ మాట్లాడుతూ, గంజాయి పండించడం వల్ల యువత భవిష్యత్తు నాశనం అవుతుందని హెచ్చరించారు. ఇది చట్ట వ్యతిరేకమైన చర్యగా పరిగణించబడుతుందని, కేసులు నమోదు చేస్తే జైలు శిక్షణ తప్పనిసరి అని తెలిపారు.ఏవైనా వ్యక్తులు గంజాయి కావాలని మైదానప్రాంతీయులు వచ్చి అడిగితే తక్షణం పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని కూడా ఆకర్షించారు.సైబర్ నేరాలపై కూడా ఆయన ఆవగాహన కల్పించారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌ను లిఫ్ట్ చేయవద్దని, సైబర్ నేరగాళ్లు పంపించే లింకులను తెరవవద్దని, బ్యాంకు అకౌంట్ వివరాలు, ఓటీపీలను ఎవరితోనైనా పంచుకోవద్దని చెప్పారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సిఆర్పీఎఫ్ పోలీసులు కూడా పాల్గొన్నారు

## మంత్రి గుమ్మడి సంధ్యారాణిని కలిసిన ఎంపిటిసి పసుపులేటి నాగమణి



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 2:** అల్లూరి సీతారామరాజు జిల్లా ఇన్చార్జ్ మంత్రి మరియు స్త్రీ శిశు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని గూడెం కొత్త వీధి మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎంపీటీసీ పసుపులేటి నాగమణి మర్యాదపూర్వకంగా కలిశారు. గూడెం కొత్త వీధి మండలాభివృద్ధికి సహకరించాలని మంత్రిని ఎంపిటిసి నాగమణి కోరారు.

# 13 వ వార్డు అబివృద్ధి పనులకు భూమి పూజ






- 3 కోట్ల 34 లక్షల జీవీఎంసీ నిధులతో ప్రధాన కాలువలు కాంక్రీట్ వాల్ కల్వర్టు పనులు
- నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే వెలగపూడి, కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ

**విశాఖ తూర్పు,పెన్ పవర్, ఫిబ్రవరి 2:**జీవీఎంసీ 13వ వార్డు శ్రీకాంత్ నగర్ వరల్డ్ విజన్ స్కూల్ సమీపంలో బాక్స్ కల్వర్టు,గెడ్డ కాంక్రీట్ రక్షణ గోడ,శివాజీ నగర్ దగ్గర గెడ్డ కాంక్రీట్ రక్షణ గోడ నిర్మాణ పనులకు గెడ్డల ఆధునీకరణకు 3 కోట్ల 34లక్షల80 వేల జీవీఎంసీ నిధులతో తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు వార్డ్ కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ,శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 3కోట్ల 34 లక్షల 80 వేల రూపాయల నిధులతో గెడ్డల, కాంక్రీట్ రక్షణ గోడల ఆధునికరణ పనులు చేయనున్నట్లు తెలిపారు. పనులను సత్వరమే ప్రారంభించి,సకాలంలో పూర్తి చేయాలని అధికారులను వారు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు,ఎస్.ఈ శాంతిరాజు,డి ఇ చంద్రమౌళి, జనసేన వార్డు అధ్యక్షులు నీలి పైడిరాజు వార్డు ప్రధాన కార్యదర్శి తురకపూడి. బాలస్వామి, తూర్పు నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు పట్టా.నూకరాజు, యువత అధ్యక్షులు వడిసెల.శ్రీను,కూటమి నాయకులుకిల్లంశెట్టి.శ్రీనివాస్, కరణం సంజీవరావు,జగన్, కనకాల శ్రీను,వెంకటేష్, గోపికృష్ణ గణపతి, షరీఫ్, భాష మనీ శ్రీదేవి,కర్రి.లక్ష్మి, ఎస్.కె లలూ, వర్క్ ఇన్స్పెక్టర్ ప్రసాద్, సానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు,జీవీఎంసీ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## బాలికల భద్రతే లక్ష్యం... చట్టాలపై అవగాహనే ఆయుధం




- వేములోవ గిరిజన ఆశ్రమ పాఠశాలలో పోలీసుల అవగాహన సదస్సు
- గంగవరం ఎస్ఐ వెంకటేష్

**గంగవరం, పెన్ పవర్ ,ఫిబ్రవరి 2:**గిరిజన ప్రాంతాల్లోని బాలికలను సామాజిక దురాచారాల నుంచి రక్షించడమే లక్ష్యంగా గంగవరం మండలం వేములోవ గ్రామంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో విస్తృత స్థాయి అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని గంగవరం పోలీస్ స్టేషన్ ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సదస్సులో విద్యార్థినులకు ప్రస్తుత సమాజంలో ఎదురవుతున్న అనేక సవాళ్లపై, ముఖ్యంగా బాల్య వివాహాల నివారణ, మహిళలపై జరుగుతున్న నేరాలు, మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు తదితర అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగాఎస్సై వెంకటేష్ మాట్లాడుతూ, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, అవి బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తును పూర్తిగా దెబ్బతీస్తాయని తెలిపారు. అలాంటి ఘటనలు తమ పరిసరాల్లో జరిగితే భయపడకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.మహిళలు, బాలికల రక్షణ కోసం ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన సఖీ యాప్, శక్తి యాప్ వినియోగంపై విద్యార్థినులకు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో ఈ యాప్‌ల ద్వారా వెంటనే సహాయం పొందవచ్చని తెలిపారు.అలాగే మాదక ద్రవ్యాల వినియోగం యువత జీవితాన్ని అంధకారంలోకి నెట్టేస్తుందని హెచ్చరిస్తూ, వాటి నివారణకు ప్రభుత్వం చేపట్టిన ఈగిల్ (1972) కార్యక్రమం గురించి వివరించారు.డ్రగ్స్ వల్ల ఆరోగ్య సమస్యలతో పాటు నేరప్రవృత్తి పెరిగే ప్రమాదం ఉందని అన్నారు.సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ నేరాలు కూడా విస్తరిస్తున్నాయని, అపరిచిత కాల్స్, లింకులు, ఆన్‌లైన్ లావాదేవీల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.ఈ అవగాహన సదస్సులో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మల్లమ్మ, ఉపాధ్యాయులు సత్యవతి, డిప్యూటీ వార్డెన్ సుదర్శిని పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బస్సులమ్మ తల్లి జాతర సందర్భంగా శ్రీ బలుసులమ్మ అమ్మవారి, పసుపు కుంకుమ గాజులు మహిళలకు పంపిణీ





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 02.**తాడేపల్లిగూడెం స్థానిక బ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి వారి దేవాలయం (పెద్ద శివాలయం) వద్ద మార్చి నెలలో జరుగునున్న బస్సులమ్మ తల్లి జాతర సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ బలుసులు అమ్మవారి, పసుపు కుంకుమ గాజులు మహిళలకు అందజేయడం జరిగింది.

ఈ సమావేశంలో పాల్గొన్న తాడేపల్లిగూడెం భారతీయ జనతా పార్టీ అసెంబ్లీ ఇన్చార్జ్ ఠ మాజీ మున్సిపల్ చైర్మన్ ఈతకోట భీమశంకరరావు (తాతాజీ), ఈలీ బాబులు, జిల్లా మీడియా కో ఇంచార్జ్ నరిసే సోమేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు దువ్వ శ్రీను, బలుసులమ్మ తల్లి దేవాలయ ఉత్సవ కమిటీ అధ్యక్షులు శ్రీరంగం అంజి, ముత్యాలమ్మ తల్లి పాలకమండల సభ్యులు రామగాని సత్యనారాయణ, కత్తిముక్కల గణేష్,కంచర్ల రాజా, శ్రీశ్రీశ్రీ బలుసులు అమ్మవారి పసుపు కుంకుమ గాజులు అందజేశారు..

## మహాశివరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రిక అందుచేత








**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ ,ఫిబ్రవరి 2:**పోలవరం జిల్లా కేంద్రం రంపచోడవరం మండలం రంప గ్రామంలో 12వ శతాబ్దంలో చోళుల కాలంలో నిర్మితమైన ప్రాచీన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఏర్పాటైన రంప శివరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహాశివరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను ప్రముఖులకు అందజేశారు.రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ళబొజ్జి రెడ్డి, శాసన సభ్యులు మిరియాల శిరీష దేవి, మాజీ శాసన సభ్యులు శీతంశెట్టి వేంకటేశ్వరరావు, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఠ జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ రాజ్ , స్థానిక డీఎస్పీ సాయి ప్రశాంత్, సర్కిల్ ఇన్స్పెక్టర్ సన్యాసినాయుడు, సబ్ ఇన్స్పెక్టర్ వెంకట్రావు లకు ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. మహాశివరాత్రి ఉత్సవాలను భక్తుల సహకారంతో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో రంపచోడవరం హిందూ ధర్మ ప్రచార భక్త మండలి కో-ఆర్డినేటర్ శ్రీ నల్లమిల్లి వేంకటరామారెడ్డి ఉత్సవ కమిటీ సభ్యుల్ళుల్గొన్నారు

## ట్రైబల్ వెల్ఫేర్ కాంట్రాక్టు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

రాష్ట్ర ముఖ్యమంత్రిని కలిసిన పోలవరం జిల్లా యూనియన్ నాయకులు

**గంగవరం, పెన్ పవర్ ఫిబ్రవరి 2 :**పోలవరం జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ కాంట్రాక్టు టీచర్స్ యూనియన్ అధ్యక్షులు శారపు కృష్ణమూర్తి దొర రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని మంగళగిరిలోని కేంద్ర టీడీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలు, జీపీస్ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ఈ భేటీలో ముఖ్యంగా రాబోయే డీఎస్సీ--2026 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం పనిచేస్తున్న 1268 మంది కాంట్రాక్టు ఉపాధ్యాయుల పోస్టులను మినహాయింపు చేయాలని,ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలని,కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి రెగ్యులరైజేషన్ చేయాలని యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు.ఈ సమస్యలను సానుకూలంగా పరిశీలిస్తామని, ట్రైబల్ వెల్ఫేర్ కాంట్రాక్టు ఉపాధ్యాయుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు యూనియన్ అధ్యక్షులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులతో పాటు జిల్లా యూనియన్ నాయకులు కిషోర్ కుమార్, కృష్ణారెడ్డి, గోపాలకృష్ణ, కాక లక్ష్మణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జీలుగు కళ్ళు అమ్మకాలపై ఎక్సైజ్ దాడులు.

అమ్మకానికి సిద్ధం చేసిన 60 లీటర్ల జీలుగు కళ్లును ధ్వంసం చేసిన ప్రోహిబిషన్-ఎక్సైజ్ సిబ్బంది.





**గుమ్మలక్ష్మీపురం జనవరి02 పెన్ పవర్.**గుమ్మలక్ష్మీపురం మండలం లోవముఠా ప్రాంతంలో జీలుగు కళ్ళు అమ్మకాలపై సోమవారం నాడు కురుపాం ప్రోహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ పి.శ్రీనివాసరావు,ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.గతంలో వనకాబడి గ్రామంలో జరిగిన సంఘటన దృశ్య,అంతేకాక జీలుగు కళ్ళు పై ల్యాబ్ టెస్టుల్లో కూడా జిలుకలు సేవించడం వల్ల హానికరం అని నిర్ధారించడంతో ఈ కల్లును నిషేదించాలనే నేపథ్యంతో.గుమ్మలక్ష్మీపురం మండలం,లోవముఠా ప్రాంతంలో గల దుడ్డుకల్లు,కొత్తవలస.గ్రామాలలో మరియు జియ్యమ వలస మండలం,చిన్న బుడ్డిడి పెద్దబుడ్డిడి,గ్రామాలలో జిలుగు కళ్ళు అమ్ముతున్న వారిని హెచ్చరించి దానివల్ల కలిగే అనర్ధాల గురించి జీలు కళ్ళు సేవించే వారికి అమ్మే వారికి అవగాహన కల్పించడం జరిగిందని,వారి వద్ద ఉన్న 60 లీటర్ల జీలుకలను ధ్వంసం చేయడమైనదని,అన్నారుఈ దాడుల్లో,కురుపాం ఎస్.ఐ,రాజశేఖర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## సెల్ సంకేతాలు అందక సచివాలయాల్లో ఆన్ లైన్ సేవలకు ఆటంకం



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 2:**సెల్ సంకేతాలు అందక సచివాలయాల ద్వారా అందించే ఆన్లైన్ సేవలకు విఘాతం కలుగుతుంది. సచివాలయులకు సిబ్బంది హాజరవుతున్న నెట్ సేవలు సక్రమంగా అందక ఇబ్బందులకు గురవుతున్నారు. జీకేవీధి మండలం గాలికొండ, అమ్మవారి ధారకొండ సచివాలయాల. పరిధిలో సుమారు 25 గిరిజన గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల ప్రజలు సచివాలయాల్లో ప్రభుత్వ ఆన్లైన్ సేవలు పొందేందుకు వస్తున్నా నెట్ సక్రమంగా అందక ఆన్లైన్ సేవలు పొందలేకపోతున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు విన్నవించిన ప్రయోజనం లేదని స్థానిక ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో ఉన్న సెల్ టవర్లను నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్లే ఈ పరిస్థితులవుతుందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంకేతాలు సక్రమంగా అందాల చర్యలు తీసుకోవాలని కోరారు.?

## కల్వర్టు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వెలగపూడి కార్పొరేటర్ మద్దెల రామలక్ష్మి



**విశాఖ తూర్పు,పెన్ పవర్, ఫిబ్రవరి 2:** జీవీఎంసీ తూర్పు జోన్ 10 వ వార్డ బి ఎన్ అర్ నగర్ లో సోమవారం జీవీఎంసీ నిధులు 14 లక్షలతో కల్వర్టు పనులకు తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు ,వెలగపూడి, 10 వ వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, రాజశేఖర్, శంకుస్థాపన చేశారు. కార్యక్రమం లోరాష్ట్ర పార్టీ నాయకులు ఒమ్మి సన్యాసిరావు,వార్డు అధ్యక్షులు గాడు అప్పలనాయుడు 12వ వార్డు(ఇంచార్జి) అదుక్షులు ఒమ్మి అప్పలరాజు, బిజెపి పార్టీ అధ్యక్షులు దొంతల రమణ, వేమల వేంకటరావు,క్లస్టర్ ఇంచార్జి :మద్దిల రాజేష్, చో?నుమూలు శ్రీనివాసరావు, కర్రి వెంకటరామారావు,కర్రి ప్రకాశరావు,బుగత తాతారావు,తలాడ లకక్ష్మణరావు,మాణిక్యాలరావు,త్రినాథరావు, రామచంద్ర రావు,కనకరాజు,ఖాదర్ భాష జిల్లా నాయకులు కుందూరు కొండమ్మ, బుజ్జమ్మ, ధనలక్ష్మి, రమాదేవి, వర్క్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ జీవీఎంసీ సిబ్బంది స్థానిక ప్రజలు తదితరుల పాల్గొన్నారు

## ఆదిత్య యూనివర్సిటీ లో విజయవంతంగా ముగిసిన "క్వాంటం కంప్యూటింగ్" వర్క్‌షాప్




**గండేపల్లి, పెన్ పవర్, ఫిబ్రవరి, 2:**ఆదిత్య యూనివర్సిటీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ & డేటా సైన్స్ విభాగం, సిఎస్ఐ స్టూడెంట్ చాప్టర్ ఆధ్వర్యంలో, ఏపీఎస్ఎస్‌డీసీ సహకారంతో నిర్వహించిన ఐదు రోజుల "క్వాంటం కంప్యూటింగ్" వర్క్‌షాప్ విజయవంతంగా ముగిసింది. మూడవ సంవత్సరం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ & డేటా సైన్స్ విద్యార్థుల కోసం నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో నేషనల్ మేనేజ్డ్ సర్వీసెస్, హైదరాబాద్‌కు చెందిన సీనియర్ అనలిస్ట్ శ్రీ డేనియల్ ఫ్రాన్స్‌వా గారు రిసోర్స్ పర్సన్‌గా పాల్గొని, క్వాంటం కంప్యూటింగ్‌కు సంబంధించిన మౌలిక సూత్రాలు, క్వాంటం బిట్స్, క్వాంటం అల్గోరిథమ్స్, క్వాంటం సర్క్యూట్స్, ప్రాక్టికల్ అప్లికేషన్స్ మరియు భవిష్యత్ అవకాశాలపై విద్యార్థులకు లోతైన అవగాహన కల్పించారు.ముగింపు కార్యక్రమంలో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం. శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి. శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ (అకాడెమిక్స్) డాక్టర్ ఎస్. రమాశ్రీ, ప్రో వైస్ ఛాన్సలర్ (ఇంజినీరింగ్ & సైన్స్) డాక్టర్ ఎ. రమేష్, రిజిస్ట్రార్ డాక్టర్ జి. సురేష్, అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.వి. రాజేష్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం హెడ్ డాక్టర్ మాకినీడి రాజాబాబు, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ వి. సతీష్ కుమార్ మరియు ఇతర అధ్యాపకులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.వక్తలు మాట్లాడుతూ, క్వాంటం కంప్యూటింగ్ భవిష్యత్ సాంకేతిక విప్లవానికి కీలకమైన రంగమని, ఈ వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆచరణలోకి తీసుకువెళ్లే సామర్థ్యాన్ని సాధించారని పేర్కొన్నారు. కార్యక్రమం ముగింపులో రిసోర్స్ పర్సన్‌కు జ్ఞాపికను అందచేశారు.

## రాజముద్ర తో కలిగిన పాస్ పుస్తకాలు రైతులకు పంపిణీ

* కొత్తపేట ఆర్డీవో శ్రీకర్




**ఆత్రేయపురం పెన్ పవర్ ఫిబ్రవరి 2:**నార్కెడిమిల్లి గ్రామ సచివాలయంలో సోమవారం రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలను రైతులకు పంపిణీ చేసే కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కొత్తపేట ఆర్డీఓ పి. శ్రీకర్ ముఖ్య అతిథిగా హాజరై రైతులకు పాస్‌పుస్తకాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఆర్డీఓ పి. శ్రీకర్ మాట్లాడుతూ, రైతుల భూమి హక్కులకు భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. భూమి రికార్డులు పారదర్శకంగా ఉండేందుకు, రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సేవలు అందించేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందన్నారు. రాజముద్రతో ఉన్న పట్టాదారు పాస్‌పుస్తకాలు రైతులకు చట్టపరమైన రక్షణతో పాటు బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాల లబ్ధి పొందేందుకు ఎంతో ఉపయోగకరమని వివరించారు.

తహశీల్దార్ ఆర్.డి. రామచంద్రమూర్తి మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో భూ సంబంధిత సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ యంత్రాంగం నిరంతరం పనిచేస్తోందని తెలిపారు. మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఎం. భాను భూ రికార్డుల నవీకరణ ప్రక్రియపై వివరాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో నార్కెడిమిల్లి మాజీ సర్పంచ్ మద్దిశెట్టి సత్యనారాయణ, గ్రామ పెద్దలు, రైతులు, గ్రామ రెవెన్యూ అధికారి ఉదయ్, సచివాలయ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రైతులు ప్రభుత్వం చేపట్టిన ఈ చర్యపై సంతృప్తి వ్యక్తం చేస్తూ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## సుస్థిర అభివృద్ధికి కేంద్ర బడ్జెట్ దోహదం: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

అయినవిల్లి సత్తి బాబు గౌడ



**కొత్తపేట/ ఆత్రేయపురం పెన్ పవర్ ఫిబ్రవరి 2 :**దేశం సుస్థిర అభివృద్ధి సాధించే దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్ కీలకంగా నిలుస్తుందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయినవిల్లి సత్తిబాబు గౌడ కోనసీమ నాయకులు అభిప్రాయపడ్డారు. రైతులు, ఎస్సీ, ఎస్టీలు, మహిళలు, యువత సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈ బడ్జెట్‌ను రూపొందించారని తెలిపారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపాదించిన వికసిత భారత్ లక్ష్యాలను సాధించేందుకు ఈ బడ్జెట్ బలమైన పునాది వేస్తుందని పేర్కొన్నారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాకు ఈ బడ్జెట్ ద్వారా పలు ప్రధాన ప్రయోజనాలు లభించనున్నాయని తెలిపారు.

వ్యవసాయ రంగంలో కొబ్బరి సాగు కోసం ప్రత్యేక పథకం, అధిక దిగుబడినిచ్చే మొక్కల పంపిణీ రైతులకు మేలు చేస్తాయని చెప్పారు. అలాగే ఆక్వా మత్స్యకారుల కోసం కోల్డ్ స్టోరేజ్ ప్లాంట్ల ఏర్పాటు, ఆక్వా ఫీడ్ ధరల తగ్గింపు ద్వారా ఆక్వా రంగానికి ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. చిన్న తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఇ ఎస్) రుణ సదుపాయాలు, పన్ను ప్రోత్సాహకాలు కల్పించడం వల్ల పరిశ్రమల అభివృద్ధికి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. ఆరోగ్య రంగంలో క్యాన్సర్ మందులపై కస్టమ్స్ డ్యూటీ తగ్గించడం వల్ల జిల్లాలోని పేద ప్రజలకు గణనీయమైన మేలు జరుగుతుందని వివరించారు. ఈ బడ్జెట్ ద్వారా కోనసీమ జిల్లా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొంటూ, బడ్జెట్‌పై కోనసీమ జిల్లా రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

# స్వచ్ఛ రత్నం వాహన పనితీరుపై పరిశీలించిన ఎంపీడీవో

**గండేపల్లి, పెన్ పవర్, డిసెంబర్, 2:**ఇటీవల ప్రభుత్వం స్వచ్ఛ రత్న పేరుతో నూతనంగా ప్రవేశపెట్టిన వాహనాన్ని మండల పరిధి నీలాద్రి రావు పేట గ్రామపంచాయతీలో సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనా నిర్వాహకుల తో మాట్లాడారు. గ్రామాలలో ప్రజలు ఈ వాహనంపై అవగాహన పెంపొందించుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా గృహాలలో పేరుకుపోయిన చెత్తాచెదారాలను ఈ వాహనం ద్వారా కొనుగోలు చేసి ప్రజలకు నిత్య అవసర సరుకులను అందిస్తున్నట్లు ప్రజలకు తెలిసే విధంగా ఉండాలన్నారు. అలాగే గ్రామంలో వివాహనం వచ్చేటప్పుడు మైకు ద్వారా ప్రజలకు తెలియపరచి అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా నాలుగు రోడ్ల కూడలిలో వాహనాన్ని ఎక్కువ సమయం నిలిపించి వాహనంలో ఉన్న మైక్ ద్వారా ప్రజలకు తెలియపరిచిన యెడల గ్రామంలోని ప్రజలు అవగాహన కల్పించుకుని వాహనం వద్దకు వచ్చి పేరుకుపోయిన చెడిపోయిన వస్తువులను ఇచ్చి నిత్య అవసర వస్తువులను కొనుగోలు చేస్తారన్నారు. అక్కడికి వచ్చిన వినియోగదారికి తెలియపరచి అలాగే తూనికలు పరిశీలించి లబ్ధిదారునికి నిత్యవసర సరుకులు అందిస్తుండగా స్వయంగా పరిశీలించారు. ఈయన వెంట గ్రామ కార్యదర్శి బిక్కిన బాలు తదితరులు ఉన్నారు.



## బిసివై స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీలో మట్టా వీరబాబు గౌడ్‌కు చోటు






**రావులపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 2:**భారత చైతన్య యువజన పార్టీ (బిసివై) సోమవారం ప్రకటించిన స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీలో కోనసీమ జిల్లా కొత్తపేట మండలం ఏనుగు మహల్ గ్రామానికి చెందిన చెందిన ప్రముఖ నాయకుడు మట్టా వీరబాబు గౌడ్ కు చోటు లభించింది.పార్టీ ఆశయాల పట్ల ఆయనకున్న అంకితభావం, గౌడ సామాజిక వర్గంతో పాటు బడుగు--బలహీన వర్గాల సమస్యలపై చూపుతున్న చిత్తశుద్ధిని గుర్తించిన బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ ఈ కీలక పదవికి ఆయనను ఎంపిక చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.ఈ సందర్భంగా మట్టా వీరబాబు గౌడ్ మాట్లాడుతూ, స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యునిగా అవకాశం కల్పించిన పార్టీ అధినేతకు కృతజ్ఞతలు తెలిపారు. కోనసీమ రైతులు, ముఖ్యంగా కొబ్బరి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై, కల్లుగీత కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసి, అధినేత ఆశయాల సాధనకు నిరంతరం పని చేస్తానని మట్ట వీరబాబు గౌడ తెలిపారు.

## ఆదిత్య విశ్వవిద్యాలయంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం



**గండేపల్లి, పెన్ పవర్, ఫిబ్రవరి ,2:**గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయంలో నేషనల్ సెంటర్ ఫర్ అడిటివ్ మాన్యుఫాక్చరింగ్ మరియు మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సోమవారం ఘనంగా ప్రారంభమైంది.ఫిబ్రవరి 2, 2026 నుంచి ఫిబ్రవరి 7, 2026 వరకు ఆరు రోజుల పాటు నిర్వహించబడుతున్న ఈ కార్యక్రమం "స్థిరమైన ప్రపంచం కోసం అడిటివ్ మాన్యుఫాక్చరింగ్: ఇంజినీరింగ్ విభాగాల అంతటా వినూత్న ఆవిష్కరణలు" అనే అంశంపై సాగుతుందని ఆదిత్య విశ్వవిద్యాలయం డిప్యూటీ ప్రో–ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంకు నేషనల్ సెంటర్ ఫర్ అడిటివ్ మాన్యుఫాక్చరింగ్ ద్వారా రూ. మూడు లక్షల నిధులు మంజూరు చేయబడినట్లు ఆయన వెల్లడించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఐటి తిరుపతి నుంచి డా. మామిళ్ళ రవి శంకర్ హాజరై, "సిరామిక్ అడిటివ్ మాన్యుఫాక్చరింగ్‌లో స్థిరత్వ అంశాలు" అనే అంశంపై సుదీర్ఘంగా ఉపన్యాసం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ ఐఐటీలు, ఎన్ఐటీలు మరియు ప్రముఖ విశ్వవిద్యాలయాల నుంచి ప్రొఫెసర్లు, విద్యావేత్తలు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డా. ఎం. బి. శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్లు డా. ఎస్. రమాశ్రీ, డా. ఆదిరెడ్డి రమేష్, రిజిస్ట్రార్ డా. జి. సురేష్, డీన్లు, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా. ఎస్. డి. వి. వి. ఎస్. భీమేశ్వర రెడ్డి, కోఆర్డినేటర్ డా. ఉజ్వల్ కిరణ్ రొక్కల మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఆదిత్య యూనివర్సిటీ వ్యవసాయ ఇంజనీరింగ్ విభాగంలో వర్క్ షాప్




**గండేపల్లి, పెన్ పవర్, ఫిబ్రవరి, 2:**గండేపల్లి మండలం సూరంపాలెం: ఆదిత్య విశ్వవిద్యాలయం లోని వ్యవసాయ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మూడో సంవత్సరం బీటెక్ విద్యార్థుల కోసం "డేటా అనలిటిక్స్ యూజింగ్ పైథాన్ ప్రోగ్రామింగ్" అనే శీర్షికతో ఐదు రోజుల ప్రాయోగిక శిక్షణా వర్క్‌షాప్‌ను జనవరి 27 నుండి 31, 2026 వరకు నిర్వహించినట్లు డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా. మేడపాటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఆధునిక వ్యవసాయ పరిశోధన మరియు ఇంజనీరింగ్ అనువర్తనాలు డేటా విశ్లేషణ కు సంబంధించిన ముఖ్యమైన నైపుణ్యాలను విద్యార్థులకు అందించడం ఈ వర్క్‌షాప్ యొక్క ప్రధాన లక్ష్యంగా ఉంది. పరస్పర చర్య తో కూడిన సెషన్ మరియు ప్రత్యక్ష ప్రదర్శనల ద్వారా డేటా నిర్వహణ, విజువలైజేషన్ మరియు ప్రాథమిక విశ్లేషణ కోసం పైథాన్ ఆధారిత సాధనాలను విద్యార్థులకు పరిచయం చేశారు. వ్యవసాయ రంగంలో డేటా ఆధారిత నిర్ణయాల ప్రాముఖ్యతను ఈ కార్యక్రమం ద్వారా స్పష్టంగా విద్యార్థులకు వివిఆరించడం జరిగింది. ఈ వర్క్‌షాప్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధి పి. నవీందర్ పాల్గొని శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డా. బి. కృష్ణ కాంత్ ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## అర్హులైన లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా



**గండేపల్లి, పెన్ పవర్, ఫిబ్రవరి, 2:**అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇస్తుందని గ్రామ టిడిపి అధ్యక్షులు బొల్లం రెడ్డి రామకృష్ణ అన్నారు. మండల కేంద్రమైన గండేపల్లి లో సోమవారం బొడ్డు తలుపులమ్మకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ సొమ్ములు అందించి ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో తలుపులమ్మ భర్త బొడ్డు లచ్చయ్య మరణించిన కారణంగా ఆయనకు వచ్చే ఎన్టీఆర్ భరోసా సొమ్ము భార్య తలుపులమ్మకు అందే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. దానిలో భాగంగానే ఒకటో తేదీ ఆదివారం వచ్చిందంటే ఒకరోజు ముందుగానే శనివారం పింఛన్ సొమ్మును అందించడం జరుగుతుందన్నారు. త్వరలోనే అర్హులైన లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు కూటమి ప్రభుత్వం ద్వారా అందించడం జరుగుతుందన్నారు. ఈయన వెంట పైలా వెంకన్న తదితరులు ఉన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com